సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:260 | హైదరాబాద్ 22 ఏప్రిల్ 2026, బుధవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-260 | Hyderabad 22 April 2026, Wednesday | Pages: 8, Rs. 5/-

## స్టాక్ మార్కెట్‌లో 'హ్యాట్రిక్' లాభాలు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం అదిరిపోయే లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు, ముఖ్యంగా అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు మొదలయ్యే అవకాశాలు ఉండటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీనికి తోడు ముడిచమురు ధరలు తగ్గడం కూడా మార్కెట్లకు ఊపునిచ్చింది. వరుసగా మూడో రోజు కూడా సూచీలు లాభాల బాట పట్టాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు మార్కెట్ ను పరుగులు పెట్టించాయి.

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

## చర్చలు వద్దంటే ఇక యుద్ధమే!



మరో మహాయుద్ధం ముంగిట ప్రపంచం?

'ట్రంప్ డీల్'కు తలొగ్గకుంటే ఇరాన్ వినాశనమే!

ఇస్లామాబాద్ చర్చలపై సందిగ్ధత..

నేటితో ముగియనున్న కాల్పుల విరమణ

మధ్యప్రాచ్యంలో శాంతి చిగురిస్తుందని ఆశించిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి యుద్ధ గర్జన చేశారు. "శాంతి కావాలా? లేక సర్వనాశనమా?" అంటూ ఇరాన్ ముందు అల్టిమేటం ఉంచారు. ఇరాన్‌తో జరగాల్సిన శాంతి చర్చల వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు అగ్రరాజ్యం యుద్ధానికి సర్వసన్నద్ధమైందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రితో కాల్పుల విరమణ గడువు ముగియనుండటంతో, ప్రపంచం ఊపిరి బిగబట్టి ఈ పరిణామాలను గమనిస్తోంది. గత రెండు వారాల కాల్పుల విరమణ సమయాన్ని అమెరికా తన సైనిక శక్తిని పెంచుకోవడానికే వాడుకుంది. అత్యాధునిక క్షిపణులు, బాంబర్లను ఇప్పటికే యుద్ధ క్షేత్రానికి తరలించినట్లు ట్రంప్ ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## కాళేశ్వరం తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ భవితవ్యం బుధవారం తేలనుంది. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నియామకాన్ని, ఆ కమిషన్ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సహా నలుగురు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం తుది తీర్పును వెలువరించనుంది.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన కాళేశ్వరంలో జరిగినట్లుగా భావిస్తున్న అక్రమాలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణకు గత మార్చి 14న ప్రభుత్వం జీవో 6ను జారీ చేస్తూ జస్టిస్ ఘోష్ కమిషన్‌ను నియమించింది.

...::: తరువాయి 2వ పేజీలో...




## ప్రశ్నించే గొంతుకలపై బ్రహ్మాస్త్రాలా?



- బాబు గారూ.. మీరు భయపడుతున్నారు
- సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ అన్నీ అబద్ధాలే!
- మీ వాళ్లకు ఒక న్యాయం.. పక్క వాళ్లకు మరో న్యాయమా?

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక, ప్రశ్నించే వారిపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరును తప్పుబడుతూ వైఎస్ జగన్ 'ఎక్స్' వేదికగా మంగళవారం ఘాటు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం ప్రతి ఇంటికీ వెళ్లి బాండ్లు ఇచ్చి, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేశారని జగన్ ఆరోపించారు. "రెండేళ్లు గడిచినా, మూడో బడ్జెట్ ప్రవేశపెట్టినా మేనిఫెస్టోలో చెప్పినవి ఏవీ అమలు చేయలేదు. పైగా అమలు చేసేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. 3.50 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారు, ఆ డబ్బు ఏమైందని అడగడం నేరమా? ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది, గ్రామీణ వ్యవస్థ దెబ్బతింది.. దీనికి సమాధానం చెప్పలేక ప్రశ్నించే వారిపై 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని ప్రయోగిస్తున్నారు," అని ఆయన ధ్వజమెత్తారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించమని, పెండింగ్ డీఏలు, పీఆర్సీ , ఐఆర్ ఇవ్వాలని కోరినందుకు ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించడం మీ భయానికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో అసెంబ్లీ సాక్షిగా సీఎం చెప్పిన అబద్ధాలు తనను బాధించాయని అన్నందుకు సీఐ శంకరయ్యను తొలగించడం నిరంకుశత్వమేనన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## పూర్వ వైభవం కావాలంటే ఎన్డీయే రావాలి

చెన్నైకి ఇచ్చిన రూ.14 లక్షల కోట్ల నిధులు ఏమయ్యాయి?

మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్, డీఎంకేలకు సీఎం చురకలు

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో రోజు తమిళనాడు పర్యటనలో భాగంగా ఎన్డీయే అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో మంగళవారం పాల్గొన్నారు. చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, తమిళనాడు అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను విపులీకరించారు. దేశాభివృద్ధికి మోదీ వంటి సమర్థవంతమైన నాయకత్వం అత్యవసరమని ఆయన ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.



...::: తరువాయి 2వ పేజీలో...

## రూ. 250 కోట్ల రైతుల సొమ్ము స్వాహా



రోడ్డున పడ్డ 2500 మంది పాలమూరు రైతులు


'ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్' భారీ మోసం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కుషాయిగూడ కేంద్రంగా నడుస్తున్న 'ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్' సంస్థ వేలమంది అమాయక రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేసింది. నమ్మిన వారిని నిలువునా ముంచేస్తూ సుమారు రూ.250 కోట్ల భారీ స్కామ్‌కు పాల్పడింది. రక్తాన్ని ధారబోసి సంపాదించుకున్న సొమ్ము, ప్రభుత్వం ఇచ్చిన పరిహారం అంతా ఆవిరి కావడంతో వందలాది మంది రైతులు ఇప్పుడు రోడ్డెక్కి కన్నీరుమున్నీరవుతున్నారు.ఈ మోసం వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి ధనుంజయ్ గుప్తా అధిక వడ్డీ ఆశ చూపి రైతులను ఉచ్చులోకి లాగినట్లు సమాచారం. నెలకు రెండు రూపాయల వడ్డీ (24% వార్షిక వడ్డీ) చెల్లిస్తానని నమ్మబలికి, ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేశాడని రైతులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, కొద్దికాలం వడ్డీ చెల్లించి నమ్మకం కలిగించి, ఆపై అసలుకే ఎసరు పెట్టాడు. ఈ కుంభకోణంలో బాధితులైన వారంతా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద తమ ప్రాణ సమానమైన భూములను కోల్పోయిన వారే కావడం బాధాకరం.

...::: తరువాయి 2వ పేజీలో...

## తెలంగాణలో బస్సులు బంద్



ఆర్టీసీతో ప్రభుత్వ చర్చలు విఫలం | నేటి నుంచి సమ్మె

4 వారాల గడువును తిరస్కరించిన జేఏసీ

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## సైలెన్స్..!



- ముగిసిన ఎన్నికల ప్రచారం.. మైకులు బంద్
- తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఈ నెల 23న పోలింగ్
- ఈ నెల 29న బెంగాల్ లో రెండో విడత
- మే 4న ఫలితాలు

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## తెలంగాణకు నార్వే పెట్టుబడులు



మంత్రి శ్రీధర్ బాబుతో ప్రతినిధుల బృందం భేటీ!

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే రాయబారి మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం భేటీ అయింది. ఈ సమావేశంలో 'తెలంగాణ-నార్వే' మధ్య ద్వైపాక్షిక సహకారం, పెట్టుబడుల అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు నార్వే కంపెనీలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## నేపాల్‌లో బంపర్ ఆఫర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నెలవారీ జీతం' పద్ధతికి నేపాల్ స్వస్తి పలికింది. ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక వెసులుబాటు కోసం ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి శాలరీ ఇచ్చేలా సరికొత్త విధానాన్ని అమల్లోకి తెస్తోంది. ఈ వినూత్న నిర్ణయానికి నేపాల్ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. సాధారణంగా నెలాఖరు వచ్చేసరికి ఉద్యోగులు డబ్బుల కోసం ఇబ్బంది పడుతుంటారు. 15 రోజులకోసారి జీతం అందడం వల్ల పిల్లల ఫీజులు, కరెంట్ బిల్లులు, రోజువారీ ఇంటి ఖర్చులను ఎవరి దగ్గరా అప్పు చేయకుండానే మేనేజ్ చేయవచ్చు.

...::: తరువాయి 2వ పేజీలో...



## టీఎంసీ గూండాలకు బుద్ధి చెబుతాం

అమిత్ షా సంచలన వ్యాఖ్యలు

**డార్జిలింగ్ (ఏడీఎన్ఎన్):**

బెంగాల్ పౌరులను, ముఖ్యంగా కొండ ప్రాంత ప్రజలను వేధించే టీఎంసీ గూండాలను మే 5 తర్వాత తలకిందులుగా వేలాడదీసి బుద్ధి చెబుతాం'అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డార్జిలింగ్‌లో మంగళవారం నిర్వహించిన సభలో మే 4న వెలువడే ఫలితాల తర్వాత మమతా బెనర్జీ సర్కారుకు కాలం చెల్లిపోతుందని, ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## భారతీయులంటే భయమెందుకు?




- అమెరికాలో భారతీయ యువతి ధీటైన జవాబు
- నెటిజన్ల ప్రశంసలు
- గణాంకాలతో విమర్శలకు చెక్
- భారతీయులను స్వాగతించండి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాలో హెచ్ 1బీ వీసాలు, భారతీయ నిపుణుల ప్రాబల్యంపై అప్పుడప్పుడూ వ్యక్తమయ్యే విద్వేషపూరిత వ్యాఖ్యలకు భారత సంతతి యువతి నేహా సూరత్రన్ ధీటుగా బదులిచ్చారు. టెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ సమావేశంలో ఆమె చేసిన ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. భారతీయ సమాజం వల్ల స్థానికులకు ముప్పు ఉందనే భయాలను ఆమె గణాంకాలతో సహా తిప్పికొట్టారు. నేహా తన ప్రసంగంలో భారతీయ సమాజం గొప్పతనాన్ని వివరిస్తూ కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. భారతీయులు ఎక్కువగా ఉన్నత విద్యావంతులని, అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారీగా ఆదాయాన్ని చేకూరుస్తున్నారని తెలిపారు. గణాంకాలను బట్టి చూస్తే భారతీయ వర్గాల్లో నేరాల రేటు అత్యల్పమని, వారు నివసించే ప్రాంతాలు అత్యంత సురక్షితమని ఆమె స్పష్టం చేశారు. "సురక్షితమైన పరిసరాలు, మెరుగైన పాఠశాలలు, ఆర్థిక పురోగతికి కారణమయ్యే ఒక వర్గాన్ని చూసి భయపడటం ఎందుకు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. మీ పిల్లలు మంచి వాతావరణంలో పెరగాలని కోరుకుంటే భారతీయులను సాదరంగా స్వాగతించాలని ఆమె పిలుపునిచ్చారు. అమెరికాలో హిందూ మతం, సంప్రదాయాలపై ఉన్న అపోహలను కూడా నేహా గట్టిగా ఖండించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## కేరళలో పెను విషాదం

...::: పూర్తి కథనం 2వ పేజీలో...



## ఏపీ ఎన్నికల కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ఎన్నికల కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందరు రోడ్డులోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ మల్లికార్జున ఆయనకు స్వాగతం పలికారు.

...::: తరువాయి 2వ పేజీలో...

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
22.04.2026
www.manasarkar.com



# సైలెన్స్..!

చెన్నై (ఏడీఎన్ఎన్):

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు ఈనెల 23న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మొదటి విడత 152 స్థానాలకు ఈ నెల 23న, అలాగే రెండవ విడత 142 స్థానాలకు ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. రెండు రాష్ట్రాల ఫలితాలూ మే 4నే వెలువడనున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రచార గడువు ముగియడంతో ఎన్నికల యంత్రాంగం పూర్తిస్థాయిలో పోలింగ్ ఏర్పాట్లపై దృష్టిసారించింది. రాజకీయ పార్టీలు కూడా ఓటర్లను ప్రసన్నం చేసుకునే వ్యవహారాల్లో నిమగ్నమయ్యాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిసిన వెంటనే రెండు రాష్ట్రాల్లో 'సైలెన్స్ పీరియడ్' అమల్లోకి వచ్చింది. ఇకపై బహిరంగ సభలు, ర్యాలీలు లేదా టీవీల ద్వారా ప్రచారం చేయడం నిషిద్ధం. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు వీలుగా పోలింగ్‌కు ముందు 48 గంటల పాటు, ఓట్ల లెక్కింపు రోజైన మే 4వ తేదీన 'డ్రై డే' (మద్యం విక్రయాల నిషేధం) అమల్లో ఉంటుందని అధికారులు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణే తమ లక్ష్యమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించినా లేదా ఎవరికైనా కొమ్ముకాసినా ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా, స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చివరి నిమిషం వరకు అగ్రనేతల సుడిగాలి పర్యటనలతో తమిళనాడు, బెంగాల్ రాజకీయ వాతావరణం వేడెక్కింది. తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ మధ్య మాటల యుద్ధం సాగగా.. బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పర విమర్శలతో హోరెత్తించారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా సాగిన ఈ ప్రచార పర్వానికి తెరపడటంతో, ఇక ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ నెలకొంది.

# నేపాల్‌లో బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి...

డబ్బు నిరంతరం ప్రజల చేతుల్లో తిరుగుతూ ఉంటేనే ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుంది. నెల మొత్తం ఒకేసారి కాకుండా, విడతల వారీగా నగదు విడుదల కావడం వల్ల మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇది రిటైల్ వ్యాపారులకు, చిన్న తరహా బిజినెస్‌లకు ఎంతో మేలు చేస్తుంది. సాధారణంగా నెలాఖరులో మార్కెట్ మందగిస్తుంది. ఈ కొత్త పద్ధతి వల్ల వ్యాపారాల్లో నిలకడైన వృద్ధి కనిపిస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఈ ఫోర్ట్ నైట్లీ పేమెంట్ విధానం విజయవంతంగా నడుస్తోంది. ఇప్పుడు దక్షిణాసియాలో ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్న మొదటి దేశంగా నేపాల్ నిలిచింది. ఈ ప్రయోగం విజయవంతమైతే, మన దేశంతో సహా ఇతర పొరుగు దేశాలు కూడా భవిష్యత్తులో ఈ బాటలో నడిచే అవకాశం ఉంది.

### టీఎంసీ గూండాలకు
# బుద్ధి చెబుతాం

మొదటి పేజీ తరువాయి...

టీఎంసీ నాయకులు, గూండాల ఆగడాలకు ముగింపు పలికే సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను షా ప్రకటించారు. మహిళలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేలు ఆర్థిక సాయం అందిస్తామని, తేయాకు తోటల కార్మికుల వేతనాన్ని రూ. 500 కు పైగా పెంచుతామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా నలుగుతున్న గూండాల సమస్యను బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వివక్ష చూపుతోందని అమిత్ షా ఆరోపించారు. ఉత్తర బెంగాల్ అభివృద్ధికి కేవలం రూ. 2 వేల కోట్లు కేటాయించి, మదర్సాల కోసం రూ. 5,700 కోట్లు వెచ్చించడం ఏంటని ప్రశ్నించారు. సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు మహిళల భద్రతపై టీఎంసీ వైఫల్యాన్ని చాటిచెబుతున్నాయని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. కాగా పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23,29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి.

# ప్రశ్నించే గొంతుకలపై బ్రహ్మాస్త్రాలా?

మొదటి పేజీ తరువాయి...

ఉగాది నాటికి జీతాలు డబుల్ చేస్తామని నమ్మబలికి, అధికారంలోకి రాగానే 2.60 లక్షల మంది వాలంటీర్ల కడుపు కొట్టారని మండిపడ్డారు. ప్రభుత్వ ఒత్తిళ్ల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు ఆకస్మిక మరణం పొందడం వాస్తవం కాదా అని నిలదీశారు. గతంలో ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడిగా ఉన్న అశోక్ బాబు టీడీపీ తరపున కర్ణాటకలో ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పుడు, బీజేపీని ఓడించమని పిలుపునిచ్చినప్పుడు ఎందుకు డిస్మిస్ చేయలేదని జగన్ ప్రశ్నించారు. మీ అనుకూల వ్యక్తులకు ఒక న్యాయం, సమస్యలు అడిగే వారికి మరో న్యాయమా అని దుయ్యబట్టారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని బాండ్లు ఇచ్చి ఇప్పుడు మొహం చాటేస్తున్నారని విమర్శించారు. తప్పులు చేస్తున్నారు కాబట్టే చంద్రబాబు భయపడుతున్నారని, అందుకే ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని జగన్ స్పష్టం చేశారు. ఈ కక్షసాధింపు చర్యలు మీ ఓటమికి సంకేతాలని ఆయన హెచ్చరించారు.

# తెలంగాణలో బస్సులు బంద్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగం స్తంభించిపోనుంది. టీజీఎస్ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై సచివాలయంలో ఐఏఎస్ అధికారుల కమిటీతో మంగళవారం జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండానే ముగిశాయి. సుమారు 4 గంటల పాటు సాగిన ఈ సుదీర్ఘ సమావేశంలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ తమ 32 ప్రధాన డిమాండ్లపై పట్టుబట్టింది. అయితే, సమస్యల పరిష్కారానికి అధికారుల కమిటీ 4 వారాల సమయం కోరగా, దానిని జేఏసీ నేతలు తిరస్కరించారు. ఇది కేవలం కాలయాపన చేసే చర్యేనని ఆరోపిస్తూ, ముందస్తుగా ప్రకటించిన విధంగానే అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో బుధవారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రంలోని అన్ని డిపోలకు బస్సులు పరిమితం కానున్నాయి. ఇప్పటికే జేఏసీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలను అలెర్ట్ చేశారు. సమ్మె పిలుపుతో లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఉదయాన్నే విధులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం చివరి నిమిషంలో కమిటీని వేసినా, నిధుల విడుదలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని కార్మిక వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం వైపు నుంచి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని, సమ్మె విరమించాలని కోరుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రైవేట్ డ్రైవర్లు, ప్రత్యామ్నాయ వాహనాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. అయినప్పటికీ, ప్రధాన రవాణా వ్యవస్థ ఆగిపోనుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత, ఉత్కంఠ నెలకొంది. డిపోల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

**ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు!**

టీజీ ఆర్టీసీ కార్మికులు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగటంతో , ప్రజారవాణాకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా తగిన



చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ ఆర్టీఓలను ఆదేశించింది. ముఖ్యంగా ప్రైవేటు డ్రైవర్లను సమకూర్చుకోవడంతో పాటు, ప్రైవేటు వాహనాల వివరాలను సేకరించి వాటిని అందుబాటులో ఉంచాలని సూచించింది. ఇక హైదరాబాద్ పరిధిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వీలైనన్ని ఎక్కువ ప్రైవేటు వాహనాలను నడిపేలా ప్లాన్ చేస్తూ, ఈ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ అధికారులను కూడా నియమించింది.

**గత్యంతరం లేకనే సమ్మెకు వెళ్ళాం : జేఏసీ**

జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అధికారుల కమిటీ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినా, స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలిపారు.

### కాళేశ్వరం తీర్పుపై
# సర్వత్రా ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి...

అయితే, ఈ కమిషన్ నియామకం చట్టవిరుద్ధమని, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం నిబంధనలను పాటించడం లేదని పేర్కొంటూ మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు , ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి కోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లు ప్రధానంగా తమ వాదనలో.. విచారణ ప్రక్రియలో సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేవలం తమను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకే నోటీసులు జారీ చేస్తున్నారని, అసలు ఈ కమిషన్ నియామకమే నిబంధనలకు విరుద్ధమని న్యాయస్థానానికి వివరించారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కొట్టివేయాలని వారు తమ పిటిషన్లలో కోరారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ విచారణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సుమారు లక్ష కోట్ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులో జరిగిన భారీ లోపాలను నిగ్గు తేల్చడం ప్రభుత్వ బాధ్యతని కోర్టులో గట్టిగా వాదించింది. ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరగడం, నిర్మాణ లోపాల వల్ల బ్యారేజీలు దెబ్బతినడం వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయడానికి ఈ కమిషన్ విచారణ అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని బెంచ్ ఇప్పటికే ఈ కేసులో రెండు పక్షాల సుదీర్ఘ వాదనలను విన్నది. నిజానికి ఈ నెల ప్రారంభంలోనే తీర్పు రావాల్సి ఉన్నప్పటికీ, ఏప్రిల్ 8న తీర్పును ఏప్రిల్ 22కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. దీంతో నేడు వెలువడనున్న ఈ 'బిగ్ వర్డిక్ట్' పై రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ తీర్పు ముఖ్యంగా విచారణ కమిటీ అధికారాల పరిధిని తేల్చనుంది. ఒకవేళ కోర్టు ప్రభుత్వం తరపున మొగ్గు చూపితే, జస్టిస్ ఘోష్ కమిషన్ తన విచారణను వేగవంతం చేసి, కేసీఆర్ సహా ఇతర బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే అవకాశం ఉంటుంది. ఇది బీఆర్ఎస్ అగ్రనేతలకు రాజకీయంగా పెద్ద చిక్కులు తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. అలాకాకుండా, పిటిషనర్ల వాదనలతో ఏకీభవిస్తూ కమిషన్ విచారణపై కోర్టు స్టే ఇచ్చినా లేదా నివేదికను రద్దు చేసినా.. అది రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా మారుతుంది. అందుకే రెండు పక్షాలు ఈ తీర్పు కోసం అత్యంత ఉత్కంఠతో వేచి చూస్తున్నాయి. జస్టిస్ ఘోష్ కమిషన్ ఇప్పటికే మేడిగడ్డ సహా ఇతర బ్యారేజీలను సందర్శించి, నీటిపారుదల శాఖ అధికారుల నుంచి భారీగా సమాచారాన్ని సేకరించింది. కీలక సాక్షులను కూడా విచారించింది. అయితే ఈ ప్రక్రియ అంతా న్యాయస్థానం ఇచ్చే తీర్పుపైనే ఆధారపడి ఉంది. కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, జూలై చివరి నాటికి తుది నివేదిక వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ తీర్పు ప్రభావం కేవలం విచారణ కమిషన్ పైనే కాకుండా, తదుపరి జరగబోయే సీబీఐ విచారణపై కూడా పడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని భావిస్తున్న తరుణంలో, హైకోర్టు తీర్పు ఆ దిశగా అడుగులు వేయడానికి మార్గం సుగమం చేస్తుందా? లేదా అనే చర్చ నడుస్తోంది.

### చర్చలు వద్దంటే ఇక
# యుద్ధమే



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇరాన్‌తో శాంతి చర్చలు జరగాల్సిన కీలక తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినమైన అల్టిమేటం జారీ చేశారు. శాంతిని ఎంచుకుంటారో లేదా సర్వనాశనానికి సిద్ధమవుతారో తేల్చుకోవాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. బుధవారం అర్ధరాత్రితో కాల్పుల విరమణ గడువు ముగియనుండటంతో అమెరికా తన అత్యాధునిక క్షిపణులు, బాంబర్లను ఇప్పటికే యుద్ధ క్షేత్రానికి తరలించి గర్జనకు సిద్ధమైంది. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం తన నౌకాదళ శక్తితో ఇరాన్‌పై గరిష్ట ఒత్తిడిని కొనసాగిస్తోంది. ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం విజయవంతంగా నిర్బంధించింది. దీనివల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్ల నష్టం వాటిల్లుతోంది. ఇదే తమ అతి పెద్ద విజయమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన 'అద్భుతమైన డీల్'కు ఇరాన్ అంగీకరించకపోతే, ఆ దేశ విద్యుత్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలపై విరుచుకుపడతామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 21న పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన రెండో విడత చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా రంగంలోకి దిగారు. అమెరికా తన నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఆగ్రహంతో ఉన్న ఇరాన్, "బెదిరింపుల నీడలో చర్చలు సాధ్యం కావు" అని భీష్మించుకుని కూర్చుంది. ఇరాన్ ప్రతినిధి బృందం ఈ చర్చలకు హాజరవుతుందా లేదా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. హర్మూజ్ జలసంధి మూసివేత, అమెరికా దిగ్బంధనం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మండిపోతున్నాయి. బ్రెండ్ క్రూడ్ ధర ఇప్పటికే బ్యారెల్ కు రూ.8000 మార్కును చేరుకుంది. యుద్ధం గనుక మొదలైతే, ఈ ధరలు రూ. 10,000 దాటే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపనుంది. ట్రంప్ అనుసరిస్తున్న 'గరిష్ట ఒత్తిడి' వ్యూహం ఇరాన్‌ను చర్చల మేజా వద్దకు రప్పిస్తుందా లేక రష్యా చైనా అండతో ఇరాన్ ఎదురుదాడికి దిగుతుందా అన్నది ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న. అణు కార్యక్రమాన్ని పూర్తిగా వదులుకుంటేనే డీల్ సాధ్యమని అమెరికా అంటుంటే, ఆంక్షలు ఎత్తివేస్తేనే శాంతి అని ఇరాన్ పట్టుబడుతోంది. గడియారం ముల్లు వేగంగా కదులుతోంది. బుధవారం లోపు ఏదో ఒక నిర్ణయం రాకపోతే, మధ్యప్రాచ్యం మరో పెను విధ్వంసానికి సాక్ష్యంగా నిలవబోతోంది.



### ఒక్క 'విజిల్'తో
# మార్పు తెద్దాం!

**విజయ్ బహిరంగ లేఖ**

చెన్నై (ఏడీఎన్ఎన్):

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసిన తరుణంలో టీవీకే అధినేత విజయ్ ఓటర్లకు మంగళవారం భావోద్వేగపూరితమైన లేఖ రాశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలంటే తన పార్టీ గుర్తు అయిన 'విజిల్'కే ఓటు వేయాలని, అవినీతి, విభజన శక్తులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తనను అనేక శక్తులు అడ్డుకోవడానికి ప్రయత్నించాయని, అయితే ప్రజలు తనపై చూపిన అచంచలమైన ప్రేమే తనను ముందుకు నడిపిస్తోందని విజయ్ పేర్కొన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని, ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. టీవీకేను సామాజిక న్యాయాన్ని కాపాడే ఒక నిప్పుకణికగా ఆయన అభివర్ణించారు. ధనబలంతో ఓటర్లను ప్రభావితం చేయాలని చూసే స్వార్థపూరిత పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయ్ హెచ్చరించారు. అలాంటి 'రాజకీయ గ్యాంబ్లర్లకు' మహిళలు, యువత తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. విజిల్ గుర్తు కాకుండా వేరే ఏ గుర్తుకు ఓటు వేసినా, అది పరోక్షంగా రాష్ట్రానికి హాని చేసే విభజన శక్తులకు మద్దతు ఇచ్చినట్లే అవుతుందని అభిప్రాయపడ్డారు. విజిల్ రివల్యూషన్ (ఈల విప్లవం) ద్వారా కొత్త రాజకీయ శకానికి నాంది పలకాలని విజయ్ లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణకు నార్వే పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి...

పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో అత్యంత అనుకూలమైన విధానాలు ఉన్నాయని, అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి భవిష్యత్తు రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ముఖ్యంగా ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ విభాగాల్లో కలిసి పనిచేసేందుకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని తెలిపారు. సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనను కూడా ఈ భేటీలో చర్చించారు. దీనిపై నార్వే రాయబారి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణతో కలిసి పనిచేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ప్రకటించారు.



# కేరళలో పెను విషాదం

### బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**8 మంది మృతి.. పలువురికి గాయాలు**

త్రిసూర్ (ఏడీఎన్ఎన్):

కేరళలోని త్రిసూర్‌లో మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రసిద్ధ 'త్రిసూర్ పూరం' ఉత్సవాల కోసం ఒక షెడ్డులో బాణాసంచా తయారు చేస్తుండగా, ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పేలుడు సంభవించిన సమయంలో కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోగా, భవనం తీవ్రంగా దెబ్బతింది. క్షతగాత్రులను వెంటనే త్రిసూర్ మెడికల్ కాలేజీకి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషాద ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలే తమిళనాడులోని విరూద్‌నగర్‌లో జరిగిన పేలుడులో పది మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే కేరళలో మరో భారీ పేలుడు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించారు. ఉత్సవాల సమయంలో నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా? అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు.



### ఏపీ ఎన్నికల కమిషనర్‌గా
# అనిల్ చంద్ర పునేఠా

మొదటి పేజీ తరువాయి...

1984 బ్యాచ్‌కు చెందిన అనిల్ చంద్ర పునేఠా ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన వారు. ఆయన విద్యాభ్యాసం ఆర్థిక శాస్త్రం , గ్రామీణాభివృద్ధిలో ఉన్నత స్థాయిలో సాగడమే కాకుండా, న్యాయశాస్త్రంలో ఎల్ఎల్‌బీ కూడా పూర్తి చేశారు. ఐఏఎస్ అధికారిగా తన ప్రస్థానాన్ని కడప జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా ప్రారంభించిన పునేఠా, తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక కీలక శాఖలను నిర్వహించారు. ముఖ్యంగా 2018లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా అత్యున్నత బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత సీసీఎల్ఏ, విజిలెన్స్ కమిషనర్ వంటి పదవుల్లోనూ పనిచేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, పునేఠా ఈ పదవిలో ఐదు సంవత్సరాల కాలానికి కొనసాగనున్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలు, పంచాయతీలు , జిల్లా పరిషత్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయన నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పూర్వ వైభవం కావాలంటే ఎన్డీయే రావాలి

మొదటి పేజీ తరువాయి...

"ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రం బలమైన పునాదులతో సాగుతోంది. ఒక్క చెన్నై నగరంలో సంక్షేమ కార్యక్రమాల కోసం కేంద్రం సుమారు రూ.14 లక్షల కోట్లు కేటాయించింది. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇస్తున్నప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలి కానీ, దారి మళ్లించడం ఎంతవరకు సమంజసం?," అని స్థానిక ప్రభుత్వంపై ప్రశ్నలు గుప్పించారు. తమిళనాడు తిరిగి తన పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే ప్రజలు ఆలోచించి ఎన్డీయే కూటమికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రధాని మోదీ చేసిన ప్రయత్నాలను చంద్రబాబు కొనియాడారు. "మహిళా రిజర్వేషన్ బిల్లు ఒక అత్యంత ప్రగతిశీల చర్య. కానీ, కాంగ్రెస్, డీఎంకే , ఇతర విపక్ష పార్టీలు తమ రాజకీయ స్వార్థం కోసం ఈ బిల్లును అడ్డుకున్నాయి. మహిళా లోకానికి అన్యాయం చేసిన ఈ పార్టీలు తక్షణమే క్షమాపణలు చెప్పాలి. మహిళలను మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో తమిళనాడు నుంచే తగిన బుద్ధి చెప్పాలి," అని ఆయన డిమాండ్ చేశారు. సమర్థులైన నాయకులను ఎన్నుకుంటేనే రాష్ట్రానికి, దేశానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని తమిళ ప్రజలకు చంద్రబాబు సూచించారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని, దేశాన్ని ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలబెడుతున్న మోదీ నాయకత్వాన్ని బలపరచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పలువురు ఎన్డీయే కూటమి నాయకులు, తమిళనాడు బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### రూ. 250 కోట్ల రైతుల
# సొమ్ము స్వాహా


మొదటి పేజీ తరువాయి...

నాగర్ కర్నూలు జిల్లాలోని సుమారు 25 గ్రామాలకు చెందిన 2500 మంది రైతులు ఈ మోసగాడి వలలో చిక్కుకున్నారు. భూమి పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న తమకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారమే భవిష్యత్తుకు ఆధారమని భావించిన వారికి ఇప్పుడు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇతర అవసరాల కోసం దాచుకున్న సొమ్ము పోవడంతో బాధితులు మంగళవారం కుషాయిగూడలోని ఫైనాన్స్ కంపెనీ కార్యాలయం, యజమాని ధనుంజయ్ గుప్తా నివాసం ఎదుట భారీ ధర్నాకు దిగారు. బాధితుల ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. "మా భూములు పోయాయి, ఇప్పుడు మా సొమ్ము కూడా పోయింది.. మాకు చావే శరణ్యం" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనుంజయ్ గుప్తా ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు తమ డబ్బు తమకు దక్కే వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. మోసపోయిన రైతుల్లో వృద్ధులు, మహిళలు కూడా ఉండటం చూస్తుంటే ఈ మోసం ఎంతటి సామాజిక విపత్తుకు దారితీసిందో అర్థమవుతోంది. స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. రైతుల ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు ఇప్పటికే సదరు ఫైనాన్స్ సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేశారు. ధనుంజయ్ గుప్తాకు సంబంధించిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే ప్రక్రియను ప్రారంభించారు. నిందితుడిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, కేవలం ఆస్తుల సీజ్ వల్ల తమకు న్యాయం జరగదని, తమ నగదు తమకు అందేలా చూడాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు చాలా పక్కా ప్రణాళికతో ఈ దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. మొదట్లో కొందరికి సకాలంలో వడ్డీ చెల్లించి, వారి ద్వారా మరికొందరిని చేర్పించే 'చైన్ సిస్టమ్' పద్ధతిని అనుసరించారు. దాదాపు రూ.250 కోట్ల నిధులు సేకరించిన తర్వాత, బాధ్యత తీసుకోకుండా యజమాని మొహం చాటేయడం పక్కా మోసమని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ భారీ కుంభకోణం వెనుక రాజకీయ నేతల హస్తం లేదా ఇతర పెద్దల ప్రోద్బలం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నగదు వసూలు చేస్తున్నా నిఘా వర్గాలు ఎందుకు గుర్తించలేకపోయాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేద రైతుల సొమ్మును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధితులు ఘోషిస్తున్నారు. ప్రస్తుతం కుషాయిగూడ పరిసరాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా యంత్రాంగం కూడా ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### భారతీయులంటే
# భయమెందుకు?

మొదటి పేజీ తరువాయి...

హిందూ మతం ఎప్పుడూ బలవంతపు మతమార్పిడులను ప్రోత్సహించదని ఆమె పేర్కొన్నారు. "మంచి వ్యక్తిగా జీవిస్తే ఎవరైనా స్వర్గానికి వెళ్తారని మేము నమ్ముతాము. మేము మా పండుగలతో పాటు క్రిస్మస్, థాంక్స్ గివింగ్ వంటి స్థానిక పండుగలను కూడా ఎంతో సంతోషంగా జరుపుకుంటాం" అని చెబుతూ సహజీవనానికి తాము ఇచ్చే ప్రాముఖ్యతను వివరించారు. శశాంక్ మట్టూ అనే వ్యక్తి ఈ వీడియోను 'ఎక్స్' (ట్విట్టర్)లో పంచుకోగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే భారతీయ విలువలను అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా చాటిచెప్పారని నెటిజన్లు నేహాపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. "భారతీయులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఆ దేశ శ్రేయస్సు కోసం కష్టపడతారనే దానికి ఈ ప్రసంగమే నిదర్శనం" అని పలువురు కామెంట్ చేస్తున్నారు.




# మెక్సికో పిరమిడ్ల వద్ద కాల్పులు.. ఒకరు మృతి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)


ప్రపంచ ప్రసిద్ధ పురాతన కట్టడమైన మెక్సికోలోని టియోటిహుకాన్ పిరమిడ్ల వద్ద రక్తపాతం చోటుచేసుకుంది. పర్యాటకులతో కిటకిటలాడుతున్న సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి హఠాత్తుగా పిరమిడ్ పైకి ఎక్కి, కింద ఉన్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో కెనడాకు చెందిన ఒక పర్యాటకుడు ప్రాణాలు కోల్పోగా, మరో 13 మంది పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఆకస్మిక దాడితో పర్యాటకులు ప్రాణభయంతో పరుగులు తీశారు. కాల్పుల నేపథ్యంలో అక్కడి వాతావరణం భీతావహంగా మారింది. జనం చెల్లాచెదురుగా పరిగెత్తడంతో పిరమిడ్ల వద్ద తొక్కిసలాట కూడా జరిగింది. ఘాతుకానికి ఒడిగట్టిన అనంతరం నిందితుడు తనను తాను కాల్చుకొని అక్కడికక్కడే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానిక అధికారులు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి ఒక తుపాకీ, కత్తి, భారీగా మందుగుండు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర బృందాలు రంగంలోకి దిగి క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మారణకాండపై మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చారిత్రక ప్రదేశాల్లో ఇలాంటి దాడులు జరగడం అత్యంత విచారకరమని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు ఈ దాడికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారు.

# లండన్‌లో టాప్ మోడల్.. దారుణ హత్య

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



సోషల్ మీడియాలో పాపులారిటీ సంపాదించుకున్న ఇద్దరు ఇన్‌ఫ్లుయెన్సర్ల మధ్య నెలకొన్న వివాదం చివరకు ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. లండన్ నగరంలోని ఒక ప్రముఖ నైట్‌క్లబ్ వెలుపల ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఇన్‌స్టాలో టాప్ మోడల్‌గా గుర్తింపు పొందిన క్లాడియా జక్రజెవ్స్కా (క్లాడియా గ్లామ్), గాబ్రియెల్ కారింగ్టన్ మధ్య జరిగిన చిన్న వాగ్వాదం పెను హింసకు దారితీసింది. వీరిద్దరి మధ్య మొదట మాటా మాటా పెరిగి పిడిగుద్దులతో కొట్టుకునే వరకు వెళ్లింది. క్లబ్ బయట గొడవ జరుగుతున్న సమయంలో, 29 ఏళ్ల గాబ్రియెల్ కారింగ్టన్ ఆవేశంతో ఊగిపోయింది. అక్కడే ఉన్న తన బ్లాక్ మెర్సిడెస్ కారులోకి ఎక్కి, క్లాడియాను లక్ష్యంగా చేసుకుని బలంగా ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా కిందపడి ఉన్న క్లాడియా పైనుంచి కారును పోనివ్వడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనలో మరో ఇద్దరు వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణానికి పాల్పడిన గాబ్రియెల్ కారింగ్టన్‌ను లండన్ పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 3.6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఆమెపై హత్యాయత్నం, ప్రమాదకరమైన డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. లండన్‌లోని సోహో ప్రాంతంలో పర్యాటకులు చూస్తుండగానే ఈ ఘటన జరగడం గమనార్హం. ఈ హత్యకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి గొడవలు, పాత పగలు ఇలా ప్రాణాలు తీసే వరకు వెళ్లడం సోషల్ మీడియా ప్రపంచంలోని చీకటి కోణాన్ని బయటపెట్టింది. సాక్ష్యాల కోసం పోలీసులు సీసీటీవీ దృశ్యాలను సేకరిస్తూ, ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్నారు. ఒకరి ప్రాణం పోవడం, మరొకరు జైలు పాలవ్వడంతో ఇద్దరి కెరీర్‌లు విషాదాంతమయ్యాయి.



# అమెరికాకు చిక్కిన ఇరాన్ నౌకలో చైనా మిస్సైల్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల మధ్య చైనా రహస్య వ్యూహాలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఇరాన్‌కు చైనా భారీగా ఆయుధాలు, సాంకేతికతను సరఫరా చేస్తోందనే ఆరోపణలకు, ఇటీవల అమెరికా స్వాధీనం చేసుకున్న 'టౌస్కా' నౌక బలమైన సాక్ష్యంగా నిలుస్తోంది. అమెరికా రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేయడంతో, బీజింగ్‌వాషింగ్టన్ మధ్య దౌత్య యుద్ధం మరింత ముదిరేలా కనిపిస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇరాన్‌కు చైనా కేవలం వాణిజ్య పరంగానే కాకుండా, సైనిక పరంగా కూడా అండగా నిలుస్తోంది. ముఖ్యంగా భుజంపై ఉంచుకుని ప్రయోగించే షార్ట్ రేంజ్ మిసైల్ లాంచర్‌లను చైనా ఇరాన్‌కు సరఫరా చేస్తున్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. తన పేరు బయటకు రాకుండా ఉండేందుకు ఇతర దేశాల మీదుగా వీటిని మళ్లించడం చైనా వ్యూహమని సమాచారం. ఈ క్రమంలోనే అమెరికాకు పట్టుబడిన 'టౌస్కా' నౌక ఇప్పుడు కీలక మలుపుగా మారింది. హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా స్వాధీనం చేసుకున్న ఈ కంటైనర్ నౌక ఇరాన్ షిప్పింగ్ లైన్స్ కు చెందినది. దీనిపై అమెరికా ఇప్పటికే ఆంక్షలు విధించింది. ఈ నౌక చైనా నుంచి నేరుగా వస్తోందని, ఇందులో క్షిపణి తయారీకి వాడే రసాయనాలు ఉన్నాయని ఆమె ధ్వజమెత్తారు. ఈ నౌకలో 'ద్వంద్వ ప్రయోజన' వస్తువులు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అనుమానిస్తోంది. అంటే పారిశ్రామిక అవసరాలకే కాకుండా, సైనిక అవసరాలకు కూడా ఉపయోగపడే లోహాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు ఇందులో ఉండే అవకాశం ఉంది. ఈ తాజా పరిణామాలు చైనాను ఇరకాటంలో నెట్టాయి. ఒకవేళ ఇరాన్ అణు లేదా క్షిపణి కార్యక్రమాలకు చైనా సహకారం అందిస్తోందని నిరూపితమైతే, అమెరికా బీజింగ్‌పై కఠినమైన వాణిజ్య ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ఇప్పటికే కొనసాగుతున్న అమెరికాచైనా ట్రేడ్ వార్ ఈ ఘటనతో మరో స్థాయికి చేరవచ్చు. ఇది చైనా ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపడమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై చైనా ప్రతిష్టను దెబ్బతీస్తుంది. నౌక సీజ్ చేయడంపై ఇరాన్ భగ్గుమంటోంది. ఇది 'సాయుధ దోపిడీ' అని అమెరికాను విమర్శించింది. నౌకలో సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నందువల్ల తాము వెనక్కి తగ్గామని, లేదంటే ప్రతిదాడి చేసేవాళ్లమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఈ నౌక వివాదం మధ్యప్రాచ్య సంక్షోభాన్ని కేవలం ప్రాంతీయ పోరుగా కాకుండా, అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధంగా మార్చేసింది. హర్మూజ్ జలమార్గం ఇప్పుడు ప్రపంచ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన ప్రాంతంగా మారిపోయింది.

# ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరగాల్సిన రెండో విడత చర్చలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. పాకిస్థాన్ వేదికగా ఈ చర్చలు జరగాల్సి ఉండగా.. ఇరాన్ కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో ఇరాన్ నేతలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

**బెదిరింపుల మధ్య చర్చలు లేవు**

ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు చర్చలంటూనే, మరోవైపు బెదిరింపులకు పాల్పడటం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో చర్చల మేజా వద్ద కూర్చునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాకుండా, ఇరాన్ నౌకల రాకపోకలపై అక్రమ దిగ్బంధనం విధించిందని ఆయన మండిపడ్డారు.

**ట్రంప్ వ్యూహంపై ఇరాన్ అనుమానాలు**

టెహ్రాన్‌ను లొంగదీసుకోవడమే లక్ష్యంగా అమెరికా అడుగులు వేస్తోందని ఇరాన్ నేతలు పేర్కొన్నారు. చర్చలను ఒక సాకుగా చూపి, తిరిగి యుద్ధాన్ని ప్రారంభించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇరాన్ ఎన్నటికీ ఒత్తిళ్లకు లొంగదని, బెదిరింపుల మధ్య చర్చలకు అంగీకరించబోదని ఇరాన్ నేతలు కరాఖండిగా చెప్పారు. గత రెండు వారాలుగా యుద్ధ రంగంలో సరికొత్త వ్యూహాలను అమలు చేయడానికి ఇరాన్ సిద్ధమవుతోందని, అవసరమైతే గట్టిగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు.

**ఇస్లామాబాద్‌కు జేడీ వాన్స్ రాక**

మరోవైపు, ఈ చర్చలను పట్టాలెక్కించేందుకు అమెరికా గట్టి ప్రయత్నాలే చేస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు రావాల్సి ఉండే.. వాళ్లు వచ్చింటే ఇరాన్‌తో నేరుగా సంప్రదింపులు జరిపి, మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పాలనేది అమెరికా ప్రాథమిక ఆలోచనగా కనిపిస్తోంది. ఇరాన్ నుంచి ప్రతినిధి బృందం వస్తుందా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

**ఇరాన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు**

చర్చల్లో పాల్గొనే విషయంపై ఇరాన్ రాజకీయ వర్గాల్లో రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. మొదటి వర్గం, అమెరికా విధించిన ఆంక్షలు, నౌకల దిగ్బంధనం ఎత్తివేసే వరకు చర్చలకు వెళ్లకూడదని పట్టుబడుతోంది. రెండో వర్గం, దౌత్యపరమైన మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ చర్చలు సజావుగా సాగితే యుద్ధం ఆపడానికి ఆస్కారం ఉండేది.

**ప్రత్యక్ష చర్చలకు ట్రంప్ మొగ్గు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్ నాయకత్వంతో నేరుగా మాట్లాడేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించారు. "ఇరాన్ నేతలు నాతో మాట్లాడాలనుకుంటే, మా వద్ద అత్యంత సమర్థవంతమైన అధికారులు ఉన్నారు. ఒకవేళ వారు నేరుగా నన్నే కలవాలని కోరుకున్నా నేను సిద్ధమే" అని ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి తాను ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు.

**శాంతికి అవకాశం ఉందా?**

అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రాయస్ ఈ పరిణామాలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించబడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. యుద్ధం వల్ల కలిగే నష్టాలను ఉభయ పక్షాలు గుర్తించాయని, అందుకే చర్చల ప్రక్రియ ఏదో ఒక రూపంలో కొనసాగుతుందని ఆయన విశ్లేషించారు. ప్రస్తుతానికి ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న ఈ పరిణామాలు ప్రపంచ శాంతిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్ పట్టువీడుతుందా లేదా అమెరికా తన ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గుతుందా అనేది వేచి చూడాలి.

# కరెన్సీ ఇస్తే.. హర్మూజ్ జలసంధిని దాటిస్తాం!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా విధిస్తున్న కఠినమైన దిగ్బంధనం కారణంగా సముద్ర మార్గంలో తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. వందలాది వాణిజ్య నౌకలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో, ఈ క్లిష్ట పరిస్థితిని సైబర్ నేరగాళ్లు, దోపిడీదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇరాన్ అధికారులమని నమ్మిస్తూ నౌకల యజమానులను నిలువునా ముంచుతున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. గ్రీక్ మ్యారిటైమ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ మారిస్క్స్ ఈ మోసాలపై నౌకల యజమానులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. కొందరు వ్యక్తులు ఇరాన్ అధికారుల వేషధారణలో నౌకల వద్దకు వచ్చి, "మాకు క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్స్ లేదా టెథర్ రూపంలో భారీగా నగదు చెల్లిస్తే.. మీ నౌకలను సురక్షితంగా జలసంధి దాటిస్తాం" అని నకిలీ హామీలు ఇస్తున్నారు. దిగ్బంధనం నుంచి తప్పించుకోవాలనే ఆతృతలో ఉన్న యజమానులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు దోపిడీకి పాల్పడుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ఇలాంటి ఎలాంటి వెసులుబాటును లేదా చెల్లింపుల విధానాన్ని ప్రకటించలేదని మారిస్క్స్ స్పష్టం చేసింది. అధికారులమని చెప్పి వచ్చే గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి క్రిప్టో చెల్లింపులు చేయవద్దని, ఇది పక్కా ప్రణాళికతో జరుగుతున్న మోసమని హెచ్చరించింది. యుద్ధం కారణంగా నిలిచిపోయిన నౌకల యజమానులు ఇలాంటి అక్రమ మార్గాలను నమ్మి మరింత నష్టపోవద్దని సూచించింది. పశ్చిమాసియాలో యుద్ధం మొదలవడానికి ముందు, ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20%, ద్రవీకృత సహజ వాయువు రవాణాలో 20% ఈ జలసంధి నుంచే జరిగేవి. ప్రస్తుతం అమెరికా దిగ్బంధనం వల్ల ఈ సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. అడ్డంకులను ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఈ కొత్త తరహా నేరాలు అంతర్జాతీయ షిప్పింగ్ రంగంలో కలకలం రేపుతున్నాయి.

# ఇస్లామాబాద్ చర్చలపై అంతర్జాతీయ ఉత్కంఠ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య జరగాల్సిన చర్చల ఫలితాల కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ చర్చల కోసం రంగంలోకి దిగడం, ఇటు ఇరాన్ చర్చలకు సుముఖంగా లేకపోవడం మరింత సంక్లిష్టంగా మార్చాయి. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా.. ఇరాన్‌ను పూర్తిస్థాయిలో అదుపులోకి తేవాలని ప్రయత్నిస్తుంటే, ఇరాన్ మాత్రం తన సార్వభౌమత్వాన్ని, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి పట్టుబడుతోంది.

**అమెరికా పట్టు.. ఇరాన్ అభ్యంతరాలు**

అమెరికా ప్రధానంగా నాలుగు డిమాండ్లను ముందుంచుతోంది. యురేనియం శుద్ధిని పూర్తిగా ఆపడం, బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రామ్‌పై నియంత్రణ, మిలిటెంట్ గ్రూపులకు మద్దతును ఉపసంహరించుకోవడం, దేశీయ నిరసనలపై కఠిన చర్యలను తగ్గించడం. దీనికి ప్రతిగా ఇరాన్ తన ఆర్థిక ఆంక్షలను ముందుగా ఎత్తివేయాలని కోరుతోంది. అణు కార్యక్రమం నిలిపివేత విషయంలో అమెరికా కోరుతున్న 20 ఏళ్ల కాలపరిమితి సాధ్యం కాదని, కేవలం 5 నుంచి 7 ఏళ్లు మాత్రమే అంగీకరించగలమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. లెబనాన్, సిరియా వంటి ప్రాంతాల్లో తమ ప్రభావాన్ని తగ్గించుకోవడం తమ భద్రతా వ్యూహానికి విఘాతమని ఇరాన్ భావిస్తోంది.

**సమాన ఒప్పందంపైనే చర్చలు**

'సమాన ఒప్పందం' అనే అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. మరోవైపు, ట్రంప్ ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ప్రకటించడం ఒక సానుకూల సంకేతం అయినప్పటికీ, అగ్రరాజ్యం తన సైనిక ఒత్తిడిని కొనసాగిస్తూనే చర్చలు జరపడం ఇరాన్‌కు రుచించడం లేదు. ఒకవేళ ఇరు పక్షాలూ పట్టువిడుపులు ప్రదర్శిస్తే, చమురు ఎగుమతులపై ఆంక్షలు సడలే అవకాశం ఉంది.

**ఒప్పందం కుదిరితే కలిగే ప్రయోజనాలు**

ఒకవేళ ఈ చర్చలు సఫలమై ఒప్పందం కుదిరితే, మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా ఉన్న ఉద్రిక్తతలు తగ్గుతాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఇరాన్ చమురు సరఫరా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గి, ఆర్థిక వ్యవస్థలు పుంజుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, అమెరికా-ఇరాన్ సంబంధాలు సానుకూల దిశలో కదిలితే, యుద్ధ విరమణ ఒప్పందం శాశ్వత శాంతికి దారితీయవచ్చు. మానవతా దృక్పథంతో ఔషధాలు, ఆహారం వంటి నిత్యావసరాలపై ఆంక్షలు తొలగడం వల్ల ఇరాన్ సామాన్య ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది.

**విఫలమైతే పొంచి ఉన్న ముప్పు**

చర్చలు విఫలమైతే పరిస్థితి అత్యంత భయానకంగా మారే అవకాశం ఉంది. మిడిల్ ఈస్ట్‌లో మళ్లీ సైనిక చర్యలు పెరిగి, ప్రాంతీయ అస్థిరత ఏర్పడుతుంది. ఇరాన్ తన అణు కార్యకలాపాలను మరింత వేగవంతం చేస్తే, అది ప్రపంచ యుద్ధానికి దారితీసే ముప్పు కూడా ఉంది. చమురు ధరలు ఆకాశాన్నంటి సామాన్యులపై భారం పడుతుంది. కాల్పుల విరమణ గడువు ముగియనుండటంతో, రాబోయే కొన్ని గంటలు మధ్యప్రాచ్యం, ప్రపంచ శాంతికి అత్యంత కీలకంగా మారాయి.

# భర్తపై కోపంతో రూ. 1.5 కోట్లు విసిరేసిన భార్య

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఒక ఆసక్తికరమైన, వింతైన ఘటన చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ ఏకంగా కరెన్సీ వర్షానికి దారితీసింది. శాంతౌ నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివసించే దంపతుల మధ్య శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో భర్తపై విపరీతమైన కోపంతో రగిలిపోయిన భార్య, ఇంట్లో ఉన్న సుమారు రూ. 1.5 కోట్ల విలువైన (2 మిలియన్ల హాంకాంగ్ డాలర్లు) నోట్ల కట్టలను బాల్కనీలోంచి కిందకు విసిరేసింది. ఆకాశం నుంచి వెయ్యి రూపాయల నోట్ల కట్టలు రాలడం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. దారిన పోయేవారు ఆ డబ్బును ఏరుకోవడానికి పెద్ద ఎత్తున ఎగబడటంతో అక్కడ తీవ్ర గందరగోళం, ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. గాలిలో ఎగిరిన నోట్లు అసలైనవేనని నిర్ధారించిన పోలీసులు, ఆ డబ్బును ఏరుకున్న వారంతా వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొందరు ఇప్పటికే ఆ సొమ్మును అపార్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌కు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "సరైన భాగస్వామిని ఎంచుకోవడమే జీవితంలో అతిపెద్ద ఫైనాన్షియల్ అడ్వైస్" అని ఒకరు కామెంట్ చేయగా, "నేను కూడా ఇలాంటి అపార్ట్‌మెంట్లలోనే నివసించాలి" అని మరొకరు సరదాగా పేర్కొన్నారు. కోపంలో అంత భారీ మొత్తాన్ని రోడ్డు పాలు చేయడం చూసి అందరూ నోరెళ్లబెడుతున్నారు. ప్రస్తుతం ఈ దంపతుల వ్యవహారంపై స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# జర్మనీ గురుద్వారలో సిక్కులు ఫైటింగ్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



జర్మనీలోని డ్యూయిస్‌బర్గ్ నగరంలో గల పవిత్ర గురుద్వారాలో మంగళవారం (ఏప్రిల్ 21, 2026) జరిగిన హింసాత్మక ఘటన అంతర్జాతీయంగా కలకలం రేపింది. గురుద్వారా కొత్త బోర్డు సభ్యుల ఎన్నికపై జరిగిన చర్చ కాస్తా రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. పవిత్ర స్థలంలో జరిగిన ఈ విధ్వంసం స్థానిక సిక్కు సమాజంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వారిని షాకింగ్‌కు గురిచేసింది. ఎన్నికల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా రెండు వర్గాలు ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగారు. సిక్కు సంప్రదాయం ప్రకారం ధరించే 'కిర్పాన్' (చిన్న కత్తులు) తో కొందరు విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ గొడవలో దుండగులు పెప్పర్ స్ప్రేలను కూడా వాడటం గమనార్హం. ప్రార్థనలు ప్రారంభం కావడానికి కొద్ది నిమిషాల ముందే సుమారు 50 మంది మధ్య ఈ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ బీభత్సంలో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న జర్మనీ పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గురుద్వారా చుట్టూ ప్రత్యేక భద్రతా బలగాలను మోహరించారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించారు. విచారణలో భాగంగా పోలీసులు ఘటనా స్థలంలో కొందరిని అదుపులోకి తీసుకోగా, ఒక వ్యక్తి నుంచి తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని ప్రస్తుత బోర్డు సభ్యుడు బిల్ద్ ఆరోపించారు. ఈ దారుణంపై జర్మనీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మతపరమైన ప్రార్థనా మందిరాల్లో ఇటువంటి హింసాత్మక చర్యలను ఎంతమాత్రం సహించబోమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన స్థానిక మేయర్, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ, పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు.



# యుద్ధం మొదలైతే.. నరకం చూపిస్తాం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)


అమెరికాతో యుద్ధం సంభవిస్తే ఎదుర్కోవడానికి తాము సర్వసద్ధంగా ఉన్నామని, శత్రువుల కోసం "కొత్త ఆశ్చర్యకరమైన వ్యూహాలను" సిద్ధం చేశామని ఇరాన్ ప్రకటించింది. గత రెండు వారాలుగా యుద్ధ సంభావ్యతను తీవ్రంగా పరిగణిస్తున్న ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ లక్ష్యాలతో కూడిన కొత్త జాబితాను రూపొందించినట్లు సమాచారం. "యుద్ధం అంటూ మొదలైతే అమెరికా, ఇజ్రాయెల్‌లకు మరో నరకాన్ని సృష్టిస్తాం" అని ఇరాన్ సైనిక వర్గాలు హెచ్చరించాయి. తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎటువంటి త్యాగానికైనా సిద్ధమని, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా దుశ్చర్యలను అడ్డుకుంటామని సెమీఅఫీషియల్ వార్తా సంస్థ తస్నిమ్ పేర్కొంది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఉద్రిక్తతలను మరింత పెంచేలా మాట్లాడారు. కాల్పుల విరమణ పొడిగించే ప్రసక్తి లేదని, తమ సైన్యం "బాంబుల వర్షం" కురిపించడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అమెరికా వద్ద భారీగా మందుగుండు సామగ్రి నిల్వలు ఉన్నాయని, చర్చల కంటే యుద్ధమే సరైన మార్గమని భావిస్తున్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు వెనక్కి తగ్గకపోవడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఇరాన్ సిద్ధం చేసిన ఆ "కొత్త ఆశ్చర్యాలు" ఏమిటనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# కెనడా వీసా ప్రాసెసింగ్ వేగవంతం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)



కెనడా వెళ్లాలనుకునే భారతీయులకు ఆ దేశ ప్రభుత్వం తీపి కబురు అందించింది. తాత్కాలిక నివాస దరఖాస్తులతో పాటు వివిధ కేటగిరీల వీసా ప్రాసెసింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తూ కెనడా ఇమిగ్రేషన్ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుల పరిశీలనను మరింత వేగవంతం చేయడం ద్వారా వేచి ఉండే సమయాన్ని తగ్గించింది. కెనడా అధికారులు వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం వివిధ వీసాల ప్రాసెసింగ్ సమయాల్లో మార్పులు ఇలా ఉన్నాయి. విజిటర్ వీసాలు గతంలో ఈ వీసా రావడానికి 37 రోజులు పట్టేది, ఇప్పుడు దానిని 23 రోజులకు తగ్గించారు. స్టడీ పర్మిట్ వీసా, విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఈ వీసా ప్రాసెసింగ్‌ను 4 వారాల నుంచి 3 వారాలకు కుదించారు. సూపర్ వీసా, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ కోసం ఇచ్చే ఈ వీసా సమయం 202 రోజుల నుంచి 182 రోజులకు తగ్గింది. తాత్కాలిక నివాస కేటగిరీల్లో సేవలను మెరుగుపరచడంలో భాగంగా ఈ మార్పులు చేసినట్లు కెనడా ఇమిగ్రేషన్ శాఖ తెలిపింది. అయితే, దరఖాస్తుల సంఖ్య, దరఖాస్తు చేసుకున్న వీసా రకం, అప్పటి పనిభారాన్ని బట్టి ఈ ప్రాసెసింగ్ సమయాల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఉన్నత చదువుల కోసం, కుటుంబ సభ్యులను కలవడానికి కెనడా వెళ్లే భారతీయులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.



# అప్పుల్లో అమెరికా.. గల్ఫ్ దేశాల భారీ డిమాండ్లు!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్)

పశ్చిమాసియాలో ఇరాన్‌తో సాగిస్తున్న యుద్ధం అమెరికాపై ఊహించని ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఒకప్పుడు గల్ఫ్ దేశాలను తన గుప్పిట్లో ఉంచుకున్న అగ్రరాజ్యం, ఇప్పుడు అవే దేశాల నుంచి భారీ పరిహారం డిమాండ్లను ఎదుర్కొంటోంది. యుద్ధం వల్ల జరిగిన ఆస్తి నష్టాన్ని భరించాలని యూఏఈ, సౌదీ వంటి దేశాలు పట్టుబడుతుండటం అంతర్జాతీయంగా సంచలనంగా మారింది. యుద్ధం కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తీవ్రంగా దెబ్బతిన్నది. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల ధాటికి దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కట్టడాలు, మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా రోజుకు మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసే 'ఫజైరా ఆయిల్ టెర్మినల్' నాశనం కావడంతో యూఏఈ ఆర్థిక వెన్నెముక విరిగింది. ఈ నష్టం నుంచి గట్టెక్కేందుకు యూఏఈ ఇప్పుడు అమెరికాను 'బెయిలవుట్ ప్యాకేజీ' కోరుతోంది. యూఏఈ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ ఖలీద్ మహమ్మద్ బలామా, అమెరికా ఫెడరల్ రిజర్వ్‌తో 'కరెన్సీ స్వాప్' ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నారు. అంటే, అమెరికా డాలర్లను అప్పుగా ఇస్తే, యూఏఈ తన సొంత కరెన్సీ దిర్హామ్‌లలో తిరిగి చెల్లిస్తుంది. ఒకవేళ అమెరికా దీనికి అంగీకరించకపోతే, చమురు వ్యాపారంలో డాలర్లకు బదులుగా చైనా కరెన్సీ 'యువాన్'ను వాడతామని యూఏఈ హెచ్చరిస్తోంది. ఇది జరిగితే అంతర్జాతీయంగా డాలర్ ఆధిపత్యం కుప్పకూలే ప్రమాదం ఉంది. యుద్ధం ముగిసిన తర్వాత ధ్వంసమైన నగరాలను, చమురు క్షేత్రాలను పునర్నిర్మించడం అమెరికాకు పెద్ద సవాల్‌గా మారనుంది. దీని కోసం అయ్యే వ్యయం అక్షరాలా వేల కోట్ల డాలర్లుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. సౌదీ అరేబియా, తన దేశంలోని చమురు మౌలిక వసతుల పునరుద్ధరణ కోసం సుమారు 60 బిలియన్ డాలర్ల (సుమారు ₹5 లక్షల కోట్లు) సాయం ఆశిస్తోంది. అమెజాన్ డేటా సెంటర్లపై దాడులు జరగడం వల్ల బ్యాంకింగ్, క్లౌడ్ సేవలు నిలిచిపోయాయి. వీటిని తిరిగి గాడిలో పెట్టడం వ్యయంతో కూడుకున్న పని. ఇదిలా ఉండగా, ఇరాన్ తన పంథాను మార్చుకుని ఆర్థిక దాడులకు దిగింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికాకు సహకరించినందుకుగానూ గల్ఫ్ దేశాలు (సౌదీ, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, జోర్డాన్) తమకు 270 బిలియన్ డాలర్ల (సుమారు ₹22.6 లక్షల కోట్లు) పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. హర్మూజ్ జలసంధిలో వసూలు చేసే టోల్ ఫీజు కాకుండా, ఈ నష్టపరిహారం చెల్లిస్తేనే శాంతి చర్చలకు మొగ్గు చూపుతామని ఇరాన్ స్పష్టం చేస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సాధారణంగా గల్ఫ్ దేశాలనే యుద్ధం కోసం డబ్బులు అడుగుతుంటారు. కానీ ఇప్పుడు ఆ దేశాలే తిరిగి అమెరికాను డబ్బులు అడగడం ఆయనకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పటికే యుద్ధం కోసం భారీగా ఖర్చు పెట్టిన అమెరికా ఖజానాపై ఈ అదనపు డిమాండ్లు భరించలేని భారం కానున్నాయి. యుద్ధం నుంచి సురక్షితంగా బయటపడటం కంటే, యుద్ధం చేయడమే చౌకగా ఉందనే పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. అమెరికా ఈ దేశాల డిమాండ్లకు తలొగ్గుతుందా? లేక తన ఆర్థిక వ్యూహాలతో గల్ఫ్ దేశాలను దారికి తెచ్చుకుంటుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా, ఈ యుద్ధం పశ్చిమాసియా రాజకీయాలనే కాకుండా ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.



## బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

అమరావతి (ఏడీఎన్ఎన్)

రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. అనంతపురంలోని ఆర్ & బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ , ఈడీ బీసీ వెల్ఫేర్ అధికారులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బీసీ విద్యార్థుల విద్యా వాతావరణం, వసతులపై మంత్రి అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాల సరళిని ఆమె సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బీసీ భవనాల నిర్మాణం, అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రతి పథకం లక్ష్యిత వర్గాలకు అందేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. తర్వాత అనంతపురం పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ & అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, డైరెక్టర్ల అభినందన సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి కార్పొరేషన్ చైర్‌పర్సన్ , డైరెక్టర్లను మంత్రి ఘనంగా సన్మానించారు. విశ్వబ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. కుల వృత్తులపై ఆధారపడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీసీ వర్గాల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.

# ఉపాధి హామీలో అవినీతి..

తాడేపల్లి (ఏడీఎన్ఎన్)

రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) అమలుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంతులేని అవినీతి, అసమర్థ నిర్ణయాలతో గ్రామీణ వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ప్రశ్నించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపాధి హామీ పథకం వెన్నెముక వంటిదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేస్తోందని జగన్ ఆరోపించారు. గతంలో ఉపాధి హామీ అమలులో దేశంలోనే అత్యుత్తమంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. ఉపాధి పొందుతున్న కుటుంబాల సంఖ్య, వారిపై చేస్తున్న వ్యయం



- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం
- కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో తగ్గిన కొనుగోలు శక్తి..
- సోషల్ మీడియా వేదికగా మాజీ సీఎం ప్రశ్నలు

గణనీయంగా తగ్గిందని.. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజల కొనుగోలు శక్తి క్షీణించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జీఎస్టీ, అమ్మకపు పన్ను వృద్ధి తక్కువగా ఉండటానికి ఇదే ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజా సమస్యలను పట్టించుకునే ఓపిక లేదని, కేవలం ధనదాహం, అవినీతిపైనే దృష్టి సారించారని జగన్ నిలదీశారు.అంతులేని అవినీతి వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, పల్లె ప్రజలకు దక్కాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందని ఆరోపించారు. ఉపాధి హామీ పనులు సరిగ్గా అందక గ్రామీణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా పల్లె ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం తన పద్ధతి మార్చుకుని గ్రామీణ ప్రగతిపై దృష్టి పెట్టాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.



## అంబటి పై మరో కేసు

గుంటూరు (ఏడీఎన్ఎన్)

వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో కేసు నమోదైంది. గత శనివారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఆయన చేపట్టిన దీక్షను పురస్కరించుకుని నగరంపాలెం పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ధర్నా వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని, అలాగే నిరసనకు ముందస్తు అనుమతి తీసుకోలేదని పోలీసులు తమ వాదనలో పేర్కొన్నారు. తన నివాసంపై దాడి చేసిన తెలుగుదేశం శ్రేణులను తక్షణమే అరెస్ట్ చేయాలని, అలాగే కస్టడీలో ఉన్న సమయంలో తనను హింసించిన పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంబటి రాంబాబు ఈ దీక్షకు దిగారు.దీక్షా శిబిరం నుంచి అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వంపై, స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "గుంటూరులో ఇళ్లపై దాడి చేసే సంస్కృతిని పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకొచ్చారు. చంద్రబాబు, లోకేశ్ , పెమ్మసాని ఆదేశాలతోనే నా ఇంటిపై దాడులు జరిగాయి. గతంలో గుంటూరులో ఇలాంటి దాడులు ఎప్పుడూ జరగలేదు," అని ఆయన ధ్వజమెత్తారు. తనపై దాడి జరిగినప్పుడు స్పందించని పోలీసులు, తనను 18 రోజులు రాజమండ్రి జైలులో ఉంచారని.. మరి తన ఇంటిపై దాడి చేసిన వారిని 18 నిమిషాలైనా జైల్లో పెట్టారా? అని పోలీసులను నిలదీశారు. టీడీపీ నేతల బెదిరింపులకు వైసీపీ శ్రేణులు భయపడవని, ప్రాణాలకు తెగించైనా చట్టబద్ధంగా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఇది తన ధర్మపోరాటమని ఆయన ఉద్ఘాటించారు. ఒకవైపు బాధితుడిగా న్యాయం కోరుతుంటే, మరోవైపు ఆయనపైనే కేసులు నమోదు చేయడం ప్రభుత్వం కుట్రలో భాగమని పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# రేపటి నుంచి మేమేంటో చూపిస్తాం: వర్మ

పిఠాపురం (ఏడీఎన్ఎన్)

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటో లేదన్న విషయమై తెలుగుదేశం , జనసేన నేతల మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాలు పరస్పరం నెట్టేసుకోవడంతో నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం ఈ వివాదానికి కేంద్రబిందువైంది. కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోను హైలైట్ చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను విస్మరించారు. ఇది గమనించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అక్కడున్న నేతలను నిలదీశారు. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి



ఫొటో లేకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వర్మ ప్రశ్నిస్తున్న సమయంలో జనసేన నేత తుమ్మల బాబు దురుసుగా సమాధానం ఇవ్వడంతో వివాదం ముదిరింది. ఈ క్రమంలో మరో జనసేన నేత పెండెం దొరబాబు.. వర్మపైకి దూసుకెళ్లి దాడి చేసే ప్రయత్నం చేశారు. పక్కనే ఉన్న ఇతర నేతలు, పోలీసులు జోక్యం చేసుకుని దొరబాబును నిలువరించారు. ఈ లోపు ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు తోసుకుంటూ బాహాబాహికి దిగారు. "టీడీపీ అండ ఉంది కాబట్టే పవన్ కళ్యాణ్‌కు 70 వేల మెజార్టీ వచ్చింది. మా వల్ల గెలిచి మాపైనే దాడులకు వస్తారా? టీడీపీ బలహీనంగా లేదు.. రేపటి నుంచి మేమేంటో చూపిస్తాం," అంటూ వర్మ జనసేన నాయకులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం ఫొటో లేకుండా ప్రోటోకాల్ ఉల్లంఘించడమే కాకుండా, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగడంపై ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం పిఠాపురంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు." గెలిపించిన టీడీపీ మీదే పడి కొడతారా?," అని ఆయన ప్రశ్నించారు. "దొరబాబు అనే వ్యక్తి మట్టి వ్యాపారం, చెరువులు తవ్వుకోవడానికి వచ్చిన వాడు. చంద్రబాబు ఆదేశాల మేరకు మేము ప్రశాంతంగా ఉంటున్నాం. కానీ ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం ఫొటో కచ్చితంగా ఉండి తీరాలి," అని ఆయన డిమాండ్ చేశారు. పిఠాపురం ఘటనే కాకుండా, కోనసీమలోనూ ఇలాంటి వివాదమే చోటుచేసుకుంది.



## హత్యలు చేయించి పరామర్శిస్తారు


మంగళగిరి (ఏడీఎన్ఎన్)

కడప జిల్లాకు చెందిన స్థిరాస్తి వ్యాపారి పెద్దదస్తగిరి హత్యపై రాష్ట్ర మంత్రి పార్థసారథి ఘాటుగా స్పందించారు. వైసీపీ నేతలు ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఎన్ని నాటకాలైనా ఆడుతారని ఆయన విమర్శించారు. మంగళగిరిలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, వైకాపా నాయకుల తీరుపై సంచలన ఆరోపణలు చేశారు. హత్యకు గురైన పెద్దదస్తగిరి వైసీపీ అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడని మంత్రి పేర్కొన్నారు."పెద్దదస్తగిరి ఎవరో ప్రజలకు తెలియాలి. ఆయన ఎంపీ అవినాశ్‌రెడ్డికి, రవీంద్రనాథ్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. అంతేకాకుండా తాడేపల్లి పెద్దల వద్ద కూడా ఆయనకు మంచి పలుకుబడి ఉంది," అని పార్థసారథి వెల్లడించారు.పులివెందులలో జరిగే కీలకమైన, రహస్య మంతనాల్లో దస్తగిరి భాగస్వామిగా ఉంటాడని కడప జిల్లాలో అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు.హత్యలు చేయించడం, ఆపై బాధితులను పరామర్శిస్తూ నాటకాలు ఆడటం వైసీపీకు వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి విమర్శించారు. వివేకానంద రెడ్డి హత్య జరిగిన సమయంలోనూ వారు ఎలా ప్రవర్తించారో, ఎలాంటి నాటకాలు ఆడారో రాష్ట్ర ప్రజలంతా చూశారని గుర్తుచేశారు."చీకట్లో చంపేయడం.. తెల్లవారగానే వెళ్లి పరామర్శించి, పోలీసులను, ప్రజలను తప్పుదోవ పట్టించేలా కారణాలు వెతకడం వైకాపా నాయకులకు అలవాటు," అని మంత్రి ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నేతలు ఎలా తెగబడ్డారో అందరూ గమనించారని, ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నారని పార్థసారథి మండిపడ్డారు. ఈ హత్య కేసులో నిందితులెవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఆత్మతో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన రెవెన్యూ అధికారి

కర్నూలు (ఏడీఎన్ఎన్)

సాధారణంగా మనుషులు చనిపోయాక ఆత్మలు దేవుడి దగ్గరకు వెళ్తాయని అంటారు. కానీ, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో మాత్రం ఆత్మలు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్నాయట! వినడానికి వింతగా ఉన్నా, భూ అక్రమార్జనలో ఆరితేరిన కొందరు అధికారుల పుణ్యమా అని మూడేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తి, తహసీల్దార్ ఎదుట ప్రత్యక్షమై "నేను విచారణకు రాను" అని స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు రికార్డులు సృష్టించారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వడ్డే మద్దయ్యకు సర్వే నంబర్ 444లో రెండు ఎకరాల పట్టా భూమి ఉంది. 1995లో మేకల వెంకటేశ్వర్లు నుంచి దీనిని కొనుగోలు చేయగా, రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయి. అయితే, అదే గ్రామానికి చెందిన అనకాల పుల్లయ్య అనే వ్యక్తి కన్ను ఈ భూమిపై పడింది. భూమి యజమాని వడ్డే మద్దయ్య 05-10-2021వ తేదీన మరణించారు. ఇదే అదనుగా భావించిన పుల్లయ్య, కొందరు రెవెన్యూ అధికారులతో లక్షల రూపాయల డీల్ కుదుర్చుకున్నాడనే ఆరోపణలు




వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా భూమిని ఆన్‌లైన్ చేసే క్రమంలో తహసీల్దార్ ఒక భారీ స్కెచ్ వేశారు. యజమాని మద్దయ్య చనిపోయారన్న కనీస జ్ఞానం లేకుండా, 04-01-2025న ఆయన విచారణకు హాజరైనట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. అంతటితో ఆగక, సదరు మద్దయ్య స్వయంగా "తాను విచారణకు రాలేనని," చెప్పినట్టు స్టేట్‌మెంట్ రికార్డు చేయడం గమనార్హం. 2021లో మరణించిన వ్యక్తి 2025లో స్టేట్‌మెంట్ ఇవ్వటం చూసి బాధితులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ 'ఆత్మ' స్టేట్‌మెంట్ ఆధారంగా 1.04 ఎకరాల భూమిని అనకాల పుల్లయ్య పేరు మీదకు మ్యూటేషన్ చేసేశారు. మద్దయ్య కుమారుడు మల్లికార్జున మీసేవ నిర్వాహకుడు కావడంతో ఈ అక్రమాన్ని వెంటనే పసిగట్టారు. చనిపోయిన తన తండ్రి పేరు మీద స్టేట్‌మెంట్ ఎలా రికార్డు చేస్తారని అధికారులను నిలదీశారు. దీనిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి జాయింట్ కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌ను ఆదేశించినా ఫలితం దక్కలేదు. ఆర్డీఓ కార్యాలయంలో నెలలుగా కేసులు నడుస్తున్నా బాధితులకు న్యాయం జరగడం లేదు. పైగా, ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బంది బాధితులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. సదరు రెవెన్యూ అధికారి పదవీ విరమణకు దగ్గరగా ఉండటంతో, తన వాహన చోదకుడిని మధ్యవర్తిగా పెట్టుకుని అందినకాడికి దోచుకుంటున్నారనే గుసగుసలు రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తున్నాయి. రీసర్వే పేరుతో రికార్డులు తారుమారు చేయడం, ఒకరి భూమిని మరొకరికి ఆన్‌లైన్ చేయడం వంటి అక్రమాలకు ఈ కార్యాలయం అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన వ్యక్తితోనే మాట కలిపిన ఈ 'మాయా' అధికారుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఉయ్యాలవాడ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సింగపూర్ నమూనాపై మంత్రుల అధ్యయనం

అమరావతి (ఏడీఎన్ఎన్)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా, మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటిస్తోంది. 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా ఏప్రిల్ 21 నుంచి ప్రారంభమైన ఈ ఏడు రోజుల శిక్షణా పర్యటనలో మంత్రులు వివిధ ఆధునిక పరిపాలన విధానాలను అధ్యయనం చేస్తున్నారు. పర్యటనలో భాగంగా మంత్రుల బృందం సింగపూర్‌లోని ప్రముఖ సమీకృత కమ్యూనిటీ హబ్ అయిన 'అవర్ టాంపైన్స్ హబ్'ను సందర్శించింది.ఒకే చోట విద్య, క్రీడలు, వినోదం , ప్రజా సేవలను అందించే ఈ హబ్‌లోని వినూత్న పద్ధతులను మంత్రులు ఆసక్తిగా పరిశీలించారు. హబ్‌లోని అత్యాధునిక థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, విశాలమైన లైబ్రరీలు, షాపింగ్ మాల్స్ మరియు ఫెస్టివ్ ఆర్ట్స్ థియేటర్లను మంత్రులు సందర్శించారు. అక్కడ ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వనరుల నిర్వహణ , పౌర సేవల డెలివరీ సిస్టమ్ గురించి సింగపూర్ అధికారులు మంత్రులకు వివరించారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలోని ఈ బృందంలో హోం మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు. సింగపూర్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' కార్యక్రమంలో భాగంగా డిజిటల్ గవర్నెన్స్, పారదర్శకత , ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై మంత్రులు అవగాహన పెంపొందించుకుంటున్నారు. సింగపూర్‌లో నేర్చుకున్న ఈ ఆధునిక పాలన పద్ధతులను ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి వంటి నగరాల అభివృద్ధిలోనూ, ప్రజా సేవల మెరుగుదలలోనూ అన్వయించాలని మంత్రులు భావిస్తున్నారు. ఏప్రిల్ 27 వరకు కొనసాగే ఈ పర్యటన తర్వాత మంత్రులు రాష్ట్రానికి తిరిగి వచ్చి, ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇతర ప్రజా ప్రతినిధులకు వివరించనున్నారు.

# ఏకంగా ఊళ్లనే నిర్మించిన జగనన్న

నెల్లూరు (ఏడీఎన్ఎన్)

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో పేదల కోసం కేవలం ఇళ్లనే కాకుండా, సకల సౌకర్యాలతో కూడిన ఊళ్లనే నిర్మించారని మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి కొనియాడారు. సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో "జగనన్న కాలనీ చంద్రబాబు కహానీ" అనే పేరుతో మంగళవారం ఆయన గడప గడపకూ తిరిగి వాస్తవాలను పరిశీలించారు. చెన్నై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అత్యంత విలువైన 14 ఎకరాల భూమిని (ఎకరా రూ. 5 కోట్లు) సేకరించి, 520 మంది నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని కాకాణి పేర్కొన్నారు. "గతంలో ఇక్కడ గిరిజనులు చెట్ల కింద నరకయాతన అనుభవిస్తుంటే చంద్రబాబు పట్టించుకోలేదు. కానీ జగన్ రాగానే అక్రమార్కుల చెరలో ఉన్న ఈ భూమిని విడిపించి పేదలకు ఇచ్చారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ. 10 లక్షల విలువైన స్థలంతో పాటు, దాదాపు రూ. 2.30 లక్షల ఆర్థిక సాయం అందించి సొంతింటి కల నెరవేర్చారు," అని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాకాణి ధ్వజమెత్తారు. "జగన్ గారు ఇళ్లు నిర్మిస్తే, వాటిని పూర్తి చేయకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులను నిలిపివేశారు.



విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇళ్లు కట్టుకున్న పేదలకు రావాల్సిన రూ. 60-70 వేల బకాయిలను వెంటనే విడుదల చేయాలి," అని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు చెప్పే ఇళ్ల లెక్కలన్నీ 'గోడకు సున్నం వేసినట్లు' పచ్చి అబద్ధాలని ఎద్దేవా చేశారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ ప్రభుత్వం ఒక లక్ష ఎకరాల భూమిని పేదల ఇళ్ల కోసం కేటాయించిందని, గృహ నిర్మాణ రంగంపై రూ. ఒక లక్ష కోట్లు ఖర్చు చేసిందని కాకాణి గుర్తుచేశారు. "జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా జగనన్న నిర్మించిన ఇళ్లపై చర్చకు మేము సిద్ధం.. కూటమి నాయకులు సిద్ధమేనా?," అని ఆయన సవాల్ విసిరారు. 2029లో మళ్లీ జగనన్న రాజ్యం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల సమస్యలపై వైసీపీ అలుపెరుగని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.



## యాపిల్స్ తో నిమ్మకాయలు పోటీ

గూడూరు (ఏడీఎన్ఎన్)

రాష్ట్రంలో భానుడి ప్రతాపం ఒకవైపు సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు నిమ్మకాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు నిమ్మరసం వైపు మొగ్గు చూపుతుండటంతో, మార్కెట్‌లో వీటికి భారీగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుత ధరలను గమనిస్తే నిమ్మకాయలు యాపిల్స్ ధరలతో పోటీ పడుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. నిమ్మకాయల విక్రయాలకు ప్రసిద్ధి చెందిన నెల్లూరు జిల్లా గూడూరు మార్కెట్‌లో మంగళవారం ధరలు ఆకాశాన్ని తాకాయి.సుమారు 50 కేజీల బస్తా నిమ్మకాయలు ఏకంగా రూ. 10,000 పలికింది. గత వారంలో కేజీ రూ. 130 నుంచి రూ. 150 మధ్య ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ. 180 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. అంటే ఒక్కో నిమ్మకాయ ధర రూ. 10 నుంచి రూ. 15 మధ్య పలుకుతోంది. నిమ్మకాయల ధరలు ఇంతలా పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. గతేడాది చివరిలో కురిసిన అకాల వర్షాలు, ఆపై పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల నిమ్మ తోటల్లో దిగుబడి గణనీయంగా తగ్గింది. మార్కెట్‌కు వచ్చే లోడ్లు తగ్గిపోవడంతో కృత్రిమ కొరత ఏర్పడింది. ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత 44 డిగ్రీలు దాటడంతో ప్రజలు డీహైడ్రేషన్ నుండి తట్టుకోవడానికి నిమ్మరసం, సోడాపై ఆధారపడుతున్నారు. హోటళ్లు, జ్యూస్ సెంటర్ల నుంచి కూడా గిరాకీ విపరీతంగా పెరిగింది. గతంలో ఎండలు పెరిగినప్పుడు నిమ్మకాయల ధరలు పెరగడం సాధారణమే అయినా, కేజీ రూ. 200కు చేరడం ఇదే మొదటిసారని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "యాపిల్స్ కొనాలన్నా రూ. 150 -200 ఉంటుంది, ఇప్పుడు నిమ్మకాయలు కూడా అదే రేటు ఉండటం షాకింగ్‌గా ఉంది," అని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఎండలు తగ్గే వరకు లేదా కొత్త పంట వచ్చే వరకు ఈ ధరల నుండి ఊరట లభించే అవకాశం లేదని తెలుస్తోంది.



## మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

రాజమహేంద్రవరం (ఏడీఎన్ఎన్)

మహిళా సాధికారత విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలను అవలంబిస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లను నీరుగార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అందాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చట్టసవరణ బిల్లును తీసుకువస్తే, కాంగ్రెస్ , దాని మిత్రపక్షాలు అడ్డుకోవడం దుర్మార్గమని ఆమె ధ్వజమెత్తారు.దశాబ్దాలుగా మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిన కాంగ్రెస్ పార్టీ, వారికి రాజకీయ అధికారం దక్కకుండా వంచించిందని పురందేశ్వరి విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలో అడ్డంకులు సృష్టించినందుకు ఆ పార్టీ దేశంలోని మహిళా లోకానికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సాధికారతను కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపిస్తున్న ఘనత బీజేపీకే దక్కుతుందని, రాబోయే రోజుల్లో మహిళలే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని ఎంపీ హెచ్చరించారు.

## 'జలధార-జలహారతి'పై కలెక్టర్ సమీక్ష



నరసరావుపేట (ఏడీఎన్ఎన్)

పల్నాడు జిల్లాలో భూగర్భ జలాల పెంపు , నీటి వనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన 'జలధారజలహారతి' కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు నిర్మించిన చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌ల స్థితిగతులపై అధికారులను ఆరా తీశారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా ప్రతి నీటి చుక్కను పొదుపు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణపై గ్రామస్థుల్లో అవగాహన కల్పించి, ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఇరిగేషన్ ఈఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.




## ఏపీలో భగభగలు

అమరావతి (ఏడీఎన్ఎన్)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కీలక హెచ్చరిక జారీ చేసింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరగనుందని, 76 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 134 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉన్న జిల్లాల వివరాలను అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలో 19 మండలాలు, విజయనగరంలో 21, పార్వతీపురం మన్యంలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4, ఏలూరు (పోలవరం ప్రాంతం) 5, విశాఖపట్నంలో 1, అనకాపల్లిలో 15, కాకినాడలో 6, తూర్పుగోదావరి జిల్లాలో 2 మండలాల్లో ఎండల ప్రభావం అత్యధికంగా ఉంటుందని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో వేడి గాలి చెవుల్లోకి వెళ్లకుండా తలపాగా లేదా గొడుగు వంటివి వాడాలని సూచించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా భానుడు భగభగలాడాడు. గరిష్ఠంగా తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 288 మండలాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు రికార్డు కావడం ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నందున వృద్ధులు, గర్భిణీలు , చిన్నపిల్లలు మధ్యాహ్నం వేళ బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు హెచ్చరించారు. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం , శ్రీ సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. వర్షం పడే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని ప్రజలను కోరారు.



## కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

సంగారెడ్డి (ఏడీఎన్ఎన్):

కాంగ్రెస్ పార్టీకి ప్రజలే అసలైన బలమని, కార్యకర్తలే ధైర్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు .సంగారెడ్డిలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమరోత్సాహంతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలోని అంతర్గత విభేదాలపై మంత్రి ఘాటుగా స్పందించారు. నాయకుల మధ్య వర్గపోరు ఉంటే అది పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు దక్కాలని, వారు పదవులను అనుభవించే రోజులు వచ్చాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే తిరుగులేని విజయం సాధించగలమని స్పష్టం చేశారు.ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలకు చోటు తగ్గి, అవకాశవాదం పెరిగిపోయిందని దామోదర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో శత్రువును ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదని నేతలకు సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా, జరగకపోయినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ అధిక

## హన్మకొండలో భారీగా హ్యాష్ ఆయిల్ సీజ్



హన్మకొండ(ఏడీఎన్ఎన్):

హన్మకొండలో భారీగా హ్యాష్ ఆయిల్‌ను తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2.5 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హన్మకొండ సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు . గంజాయి నుంచి హ్యాష్ ఆయిల్‌ను తయారు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసులో 'పాండు' అనే వ్యక్తి ప్రధాన సూత్రధారిగా ఉన్నాడని, హ్యాష్ ఆయిల్‌తో ఎక్కువ లాభాలు వస్తాయని అతను ముఠా సభ్యులకు సలహా ఇచ్చాడని సీపీ వివరించారు. అతని సలహాతో ముఠా సభ్యులు భారీగా గంజాయిని సేకరించి పాండుకు అందించగా, అతను యంత్రాల సహాయంతో 40 లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను తయారు చేశాడు. ఇందులో 20 కిలోలను తన వద్దే ఉంచుకుని, మిగతా మొత్తాన్ని నిందితులకు అప్పగించాడు.నిందితులు ఈ హ్యాష్ ఆయిల్‌ను ముంబైలో విక్రయించేందుకు ఒడిశా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. రైలులో మాదకద్రవ్యాలను తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు.

## దూకుడు పెంచిన గులాబీ బాస్



హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకల ముగింపును పురస్కరించుకుని కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం 'తెలంగాణ భవన్'లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ రజతోత్సవ వేడుకల ముగింపు వేళ జరగనున్న ఈ భేటీలో భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ఈ సమావేశంలో ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతో పాటు, క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే వ్యూహాలను కేసీఆర్ వివరించనున్నారు. ఈ భేటీకి ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జెడ్పీ చైర్మన్లు సహా పార్టీలోని ముఖ్య నేతలందరూ భారీగా తరలిరానున్నారు.

# నాపై సీఎంకు కడుపుమంట

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనపై కడుపుమంట, అక్కసు తప్ప మరేమీ లేవని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగిత్యాల సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందించిన తీరును ఆయన తప్పుబట్టారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కేసీఆర్ ఎంతో హుందాగా మాట్లాడితే, రేవంత్ రెడ్డి మాత్రం చిల్లర మాటలతో స్థాయిని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. జగిత్యాల, కాటారం సభలతో ప్రజలకు ఎవరు రాష్ట్రం కోసం తపిస్తున్నారో, ఎవరు మాటలతో కాలక్షేపం చేస్తున్నారో అర్థమైందని ఎద్దేవా చేశారు.తన ఢిల్లీ పర్యటనపై వస్తున్న వార్తలను హరీశ్ రావు పూర్తిగా ఖండించారు. తన పర్యటనలో ఎలాంటి రహస్యం లేదని, అందరి కళ్లముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కి వెళ్లాను తప్ప దొంగచాటుగా వెళ్లలేదని స్పష్టం చేశారు. కేవలం పార్టీ ఫిరాయింపుల కేసుపై న్యాయ నిపుణులతో చర్చించేందుకే తాను ఢిల్లీకి వెళ్లానని, ఇందులో దాచాల్సింది ఏమీ లేదని కుండబద్దలు కొట్టారు. తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టులో విచారణకు రానున్న 'ఓటుకు నోటు' కేసును హరీశ్ రావు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ కేసులో బీఆర్ఎస్ పార్టీ ఇంప్లీడ్ అయిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ, తన ఢిల్లీ పర్యటన ఉద్దేశం చట్టపరమైన అంశాలపై చర్చించడమేనని వివరించారు. సీఎంవో నుంచి వస్తున్న లీకులు పసలేనివని, రాజకీయంగా తనను ఎదుర్కోలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు.రహస్య భేటీలు చేయడం తనకు అలవాటు లేదని, అవి రేవంత్ రెడ్డికే వెన్నతో పెట్టిన విద్య అని హరీశ్ రావు ఎదురుదాడికి దిగారు. రాత్రి రాహుల్ గాంధీని కలిసి, ఉదయం కేంద్ర మంత్రులను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలవడం రేవంత్ రెడ్డికే సాధ్యమని ఎద్దేవా చేశారు. ద్వంద్వ ప్రమాణాలు పాటించేది ఎవరో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసని, తమపై నిందలు వేసే ముందు సీఎం తన రాజకీయ చరిత్రను చూసుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం నూటికి నూరు శాతం ఖాయమని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు ఇప్పటికీ అపారమైన నమ్మకం ఉందని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలోనే రాజకీయంగా రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, బీఆర్ఎస్ జెండా మళ్లీ సగర్వంగా ఎగురుతుందని ఆయన ఉద్ఘాటించారు.

## బీఆర్ఎస్ అంతం కేసీఆర్ చూడాలి

నిజామాబాద్(ఏడీఎన్ఎన్):



నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రాజకీయ ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఆరోగ్యంపై స్పందిస్తూ.. ఆయన చనిపోవాలని తాము కోరుకోవడం లేదని, ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అయితే, తన కళ్లముందే బీఆర్ఎస్ పార్టీ అంతం కావడం, ఆ పార్టీ చావును కేసీఆర్ కళ్లారా చూడాలన్నదే తన కోరికని అర్వింద్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ఆయన పిల్లలైన కేటీఆర్, కవితలే ఎక్కువగా హింసిస్తున్నారని, వారికి ఫ్లైట్ టికెట్లు ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా అర్వింద్ మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పసుపు రైతులకు ఆయన కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర కల్పించి తీరుతానని స్పష్టం చేశారు. జగిత్యాల సభలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు ఆడారని విమర్శిస్తూ, రైతుల ప్రయోజనాల కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని అర్వింద్ ఉద్ఘాటించారు.

## మహిళా బిల్లుపై రాహుల్ గాంధీ డ్రామాలు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కకుండా ప్రతిపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని, రాహుల్ గాంధీ పార్లమెంటులో ఏమాత్రం హుందాగా వ్యవహరించలేదని ఆమె విమర్శించారు. ఈ బిల్లు వల్ల ప్రధాని మోదీకి మంచి పేరు వస్తుందనే భయంతోనే విపక్షాలు అడ్డుతగిలాయని ఆరోపించిన అరుణ, దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశం పేరుతో విడగొట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, మహిళలను అవమానిస్తున్న ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనేది కేవలం అపోహ మాత్రమేనని కొట్టిపారేశారు. ఇదే క్రమంలో, ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్‌నగర్ పర్యటనకు రానున్నారని, 'ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్' విజేతలకు ఆయన బహుమతులు అందజేస్తారని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.



## జగిత్యాల సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో దడ

జగిత్యాల(ఏడీఎన్ఎన్):



తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను సంచలనం రేపుతున్నాయి. జగిత్యాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. నిన్న జగిత్యాలలో జరిగిన కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని, అది చూసి ఓర్వలేకే రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కేసీఆర్ పుణ్యం వల్లే రేవంత్ రెడ్డి ఈరోజు ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నారని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తిని పట్టుకుని 'ఉరి తీస్తాను' అనడం రేవంత్ అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. నిన్నటి బీఆర్ఎస్ సభ తెలంగాణ ఉద్యమ రోజులను తలపించిందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను రేవంత్ సర్కార్ పూర్తిగా నాశనం చేసిందని జీవన్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా కనీసం విద్యాశాఖపై ఒక్క రివ్యూ కూడా చేయలేదని విమర్శించారు. గురుకులాలను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని పేర్కొన్నారు. రైతుబంధు నిధులను రేవంత్ రెడ్డి మూడుసార్లు ఎగ్గొట్టారని, అన్నదాతలను నిలువునా ముంచారని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారారని జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. వారి చేతిలో కీలుబొమ్మలా ఆడుతూ తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రేవంత్ రెడ్డి సహకరించడం తెలంగాణకు ద్రోహం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.గత చరిత్రను గుర్తు చేస్తూ.. 2015లో టీడీపీలో ఉన్నప్పుడు వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయడం కోసం రేవంత్ రెడ్డి 'ఓటుకు నోటు' కేసులో అడ్డంగా దొరికిపోయిన విషయాన్ని జీవన్ రెడ్డి ప్రస్తావించారు. రేవంత్ రెడ్డికి రాజకీయ విలువలు లేవని, ఆయన మాటల్లో సోయి లేదని విమర్శించారు. నాదెండ్ల భాస్కరరావు అంశంపై రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను జీవన్ రెడ్డి తిప్పికొట్టారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయాంలో నాదెండ్లను మంత్రి పదవి నుంచి తొలగించినప్పుడు, ఆయనకు మద్దతుగా తానే స్వచ్ఛందంగా మంత్రి పదవికి రాజీనామా చేశానని, తనను ఎవరూ తొలగించలేదని స్పష్టం చేశారు.నాటి ఇందిరా గాంధీ మొదలుకొని కాంగ్రెస్ పార్టీ మొత్తం నాదెండ్ల భాస్కరరావుకు మద్దతుగా నిలిచిన విషయం రేవంత్ రెడ్డికి తెలియకపోవడం విచారకరమని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. చరిత్ర తెలియకుండా ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు.తెలంగాణలో ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని, 'రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే నినాదం క్షేత్రస్థాయిలో వినిపిస్తోందని జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి వైఖరి వల్ల కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ఆదరణ తగ్గుతోందని, ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బదిలీల ప్రక్రియపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం జీవో విడుదల కావడంతో సచివాలయం నుంచి క్షేత్రస్థాయి కార్యాలయాల వరకు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.ప్రభుత్వం విడుదల చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం, ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. అంటే నెల రోజుల పాటు ఉద్యోగులకు తమకు కావలసిన చోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించారు. ముఖ్యంగా ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ బదిలీల్లో ప్రాధాన్యత లభించనుంది.గత కొంతకాలంగా బదిలీలపై నిషేధం కొనసాగుతుండటంతో చాలా మంది ఉద్యోగులు తమ సొంత జిల్లాలకు లేదా అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు నిషేధం ఎత్తివేయడంతో వేలాది మంది ఉద్యోగులకు మేలు జరగనుంది. బదిలీల ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆయా శాఖల నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మే నెలాఖరుకల్లా ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేసి, జూన్ నుంచి ఉద్యోగులు కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. దీనికి సంబంధించి మరిన్ని సమగ్ర మార్గదర్శకాలను ఆయా శాఖలు విడివిడిగా విడుదల చేసే అవకాశం ఉంది.



## బీఆర్ఎస్‌లో మహిళలకు గౌరవం లేదు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ 'ప్రజా ఆశీర్వాద సభ'పై కవిత సెటైర్లు వేశారు. 75 ఏళ్లు వచ్చిన కేసీఆర్ తనను తాను 'నవ యువకుడు'గా అభివర్ణించుకోవడాన్ని ఆమె ఎద్దేవా చేశారు. "75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడైతే, మరి రాష్ట్రంలోని లక్షలాది మంది అసలైన యువకులు ఏమవ్వాలి?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో మహిళలకు గౌరవం లేదని, ఆ పార్టీ కేవలం స్వార్థ రాజకీయాల కోసమే పని చేస్తోందని ఆరోపిస్తూ, యువత ఆకాంక్షలను గుర్తించడంలో తమ తండ్రి పార్టీ విఫలమైందని సంచలన వ్యాఖ్యలు చేశారు.తమను ఓడించి ప్రజలు తప్పు చేశారన్న కేసీఆర్ వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల తీర్పును గౌరవించకుండా వారిని విమర్శించడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. కేసీఆర్ 'ఉట్టి కథలు' చెబితే, కాంగ్రెస్ 'పిట్ట కథలు' చెబుతోందని, కానీ ఎవరూ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే క్రమంలో ఏప్రిల్ 25న మేడ్చల్‌లో తాను కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించిన కవిత, తన పార్టీ యువత, మహిళల గొంతుకగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఐఏఎస్ అధికారిపై ఢిల్లీ హైకోర్టు సీరియస్

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఫిర్యాదులపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం కీలక విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల నిధులతో ఆయన తన కుమార్తె వివాహాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారని, ఫైవ్ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వేడుకల ఖర్చులన్నీ కాంట్రాక్టర్లే భరించారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది సర్వీస్ నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, గత నాలుగేళ్లుగా ఈ కేసులో ఎలాంటి పురోగతి లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉన్నప్పుడు ఈ ప్రక్రియను ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించిన హైకోర్టు, రజత్ కుమార్‌పై వచ్చిన ఫిర్యాదును మూడు నెలల్లోగా పరిష్కరించి, ఒక తార్కిక ముగింపు ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేయడంతో, రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఎటు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## కాంగ్రెస్‌కు ఏటీఎంగా కాళేశ్వరం



కరీంనగర్(ఏడీఎన్ఎన్):

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శనాస్త్రాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ సంధించారు. కరీంనగర్ లో మంగళవారం జరిగిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ , కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో లక్ష కోట్ల అవినీతి అని ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీబీఐకి రాసిన లేఖలో కేవలం 9 వేల కోట్ల స్కామ్ అని పేర్కొనడం వెనుక మతలబు ఏంటని ఆయన నిలదీశారు. అవినీతి అంచనాల్లో ఈ భారీ వ్యత్యాసంపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలా లేక 9 వేల కోట్లపైనే దర్యాప్తు చేయాలా అనే విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని, అవి ఒకదానికొకటి సహకరించుకుంటున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఒకరి అవినీతిని మరొకరు ప్రోత్సహిస్తూ రాజకీయ లబ్ధి పొందుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి చాల రోజులైన కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.కాళేశ్వరం కుంభకోణం విషయంలో రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌ను కాపాడుతున్నారని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే రీతిలో ఉపయోగపడుతోందని ఎద్దేవా చేశారు. రెండు పార్టీల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

## దమ్ముంటే సీబీఐ విచారణ చేయించు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బండి సంజయ్ కేవలం ప్రెస్ మీట్‌లకే పరిమితమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాహుకేతువులతో పోల్చిన బండి సంజయ్, అసలు తాను ఏ గ్రహమో ప్రజలకు చెప్పాలని ఎద్దేవా చేశారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై బండి సంజయ్‌కు ఏమాత్రం ఆలోచన లేదని, కేవలం రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ విషయంలో కేంద్రం ద్వంద్వ వైఖరిని చామల ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరితే 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని గతంలో కిషన్ రెడ్డి అన్నారని, మరి 2025 ఆగస్టులోనే ప్రభుత్వం లేఖ రాసినా ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బండి సంజయ్ శాఖ పరిధిలోనే సీబీఐ ఉన్నప్పటికీ, విచారణ జరపకుండా కాలయాపన చేస్తూ ఇప్పుడు తిమ్మిని బమ్మిని చేసేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.మెట్రో ఫేజ్ 2, ట్రిపుల్ ఆర్, మూసీ ప్రక్షాళన వంటి కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుండి నిధులు తీసుకురావడంలో కేంద్రమంత్రులు విఫలమయ్యారని చామల ఆరోపించారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేలా సభ ఏర్పాటు చేయాలని, దానికి పార్టీలకు అతీతంగా ప్రజలను తరలించే బాధ్యత తమదని సవాల్ విసిరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఇక పార్టీ వీడిన సీనియర్ నేత జీవన్ రెడ్డిపై చామల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిని చేయాలని తాము భావించామని, కానీ ఆయన ఆలోచన లేకుండా బీఆర్ఎస్‌లో చేరి తప్పు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో అలిగితే అగ్రనేతలు వచ్చి బుజ్జగించేవారని, కానీ బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఆయనకు ఇచ్చిన జనరల్ సెక్రటరీ పదవికి ఎలాంటి విలువ ఉండదని సెటైర్లు వేశారు.గతంలో కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన పొన్నాల లక్ష్మయ్య వంటి నేతల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో జీవన్ రెడ్డి గమనించాలని సూచించారు. రేపు జీవన్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంగా మారిందని ప్రధాని మోదీ అన్నారని, మరి అప్పుడు దోచుకున్న లక్ష కోట్లు ఎక్కడికి పోయాయో, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో బీజేపీ నేతలే సమాధానం చెప్పాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి నిలదీశారు.

## రాశి ఫలాలు

**22-04-2026 బుధవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాలు రాబడిపరంగా బాగా అనుకూలంగా ఉంటాయి. సోదరులతో రాజీమార్గం ద్వారా ఆస్తి వివాదం పరిష్కరించుకుంటారు. వాహన కొనుగోలు ప్రయత్నాలు చేపడతారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆర్థిక పరిస్థితులు బాగా మెరుగ్గా ఉంటాయి.

**వృషభం:**
ఉద్యోగంలో మీ పనితీరుతో అధికారులను ఆకట్టుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో కొద్దిగా శ్రమాధిక్యత ఉంటుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. ప్రయాణాల్లో విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సమాజంలో పలుకుబడి బాగా పెరుగుతుంది.

**మిథునం:**
ఉద్యోగంలో అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుంది. ఆశించిన పురోగతి ఉంటుంది.వృత్తి,వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.పెళ్లి ప్రయత్నాల్లో కొందరు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనుల్లో శ్రమ పెరిగినప్పటికీ, నిదానంగా పూర్తి చేస్తారు.

**కర్కాటకం:**
వృత్తి, వ్యాపారాల్లో శ్రమాధిక్యత ఉన్నప్పటికీ ప్రతిఫలం ఎక్కువగానే ఉంటుంది. ధార్మిక వ్యవహారాల్లో ఎక్కువగా పాల్గొంటారు. ఆదాయ వ్యయాలు సమానంగా ఉంటాయి. ఊహించని రాజపూజ్యాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో కొద్దిగా ఆటంకాలు ఉండే అవకాశముంది.

**సింహం:**
ఉద్యోగంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాలు నిలకడగా సాగుతాయి. ఎదురుచూస్తున్న శుభవార్తలు వింటారు. ఇంటా బయటా అనుకూల పరిస్థితులుంటాయి. పెళ్లి ప్రయత్నాలు ఫలిస్తాయి. మంచి పరిచయాలు ఏర్పడతాయి.

**కన్య:**
ఉద్యోగంలో ప్రాధాన్యం, ప్రాభవం పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో క్షణం కూడా తీరిక ఉండని పరి స్థితి ఏర్పడుతుంది. ఆదాయం ఆశించిన స్థాయిలో ఉంటుంది. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. పిల్లల చదువుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**తుల:**
ఆదాయవృద్ధికి అవకాశముంది. ఉద్యోగరీత్యా చేసే ప్రయాణాలు లాభదాయకంగా కొనసాగుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు లాభాల బాటపడతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాల్లో లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండడం మంచిది.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగాల్లో పని భారం బాగా పెరుగుతుంది. వ్యాపారాల్లో నష్టాల నుంచి చాలావరకు బయటపడతారు. ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, సరైన విధంగా వాటిని పూర్తి చేస్తారు.

**ధనస్సు:**
వృత్తి, వ్యాపారాల మీద శ్రద్ధ మరింతగా పెరుగుతుంది. ఆదాయ వృద్ధి ప్రయత్నాలు బాగా పుంజు కుంటాయి. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. మొండి బాకీలు కూడా వసూలవుతాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరణ పొందుతారు. ప్రయాణాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం మంచిది.

**మకరం:**
వృత్తి, వ్యాపారాల్లో పోటీదార్ల మీద పైచేయి సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాల్లో శుభవార్తలు అందుతాయి. మంచి పరిచయాలు ఏర్పడతాయి. పిల్లలు పోటీ పరీక్షల్లో విజయాలు సాధిస్తారు. సమాజంలో మాటకు విలువ పెరుగుతుంది. ఆక స్మిక ధన లాభ సూచనలున్నాయి.

**కుంభం:**
వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొత్త కార్యక్రమాలు, కొత్త పనులు ప్రారంభిస్తారు. గృహ, వాహన సౌకర్యాలపై దృష్టి పెట్టే అవకాశముంది. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు సజావుగా సాగుతాయి.

**మీనం:**
వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు బాగా పెరిగినప్పటికీ, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపా రాలు ఉత్సాహంగా సాగుతాయి. రుణ సమస్యల నుంచి కొంత ఊరట లభిస్తుంది. అదనపు ఆదాయ ప్రయత్నాలకు అనుకూలమైన వాతావరణం ఉంది. గృహ, వాహనాల కొనుగోలుపై దృష్టి కేంద్రీ కరిస్తారు. పిల్లలు పురోగతి సాధిస్తారు.



## గుంటూరులో కూల్చివేతలు.. స్థానికుల్లో ఆగ్రహం

**గుంటూరు (ఏడీఎన్ఎన్):**

గుంటూరు నగరంలోని మోతీలాల్ నగర్ ప్రాంతంలో ఇళ్ల తొలగింపు చర్యలు ఉద్రిక్తతకు దారితీశాయి. అధికారుల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నడుమ నిరుపేదల నివాసాలను కూల్చివేయడం స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులను సృష్టించింది. ప్రత్యామ్నాయ వసతి కల్పించకుండా అకస్మాత్తుగా ఇళ్లను తొలగించడం పట్ల బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులతో కలిసి ఎక్కడికి వెళ్లాలో తెలియక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ముందస్తు సమాచారం లేకుండానే ఈ చర్యలు చేపట్టారని వారు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో బాధితులు స్థానిక ఎమ్మెల్యే నజీర్‌ను కలిసి సమస్యను వివరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే తమ సమస్యకు సరైన స్పందన రాలేదని, అసహాయక పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా, ఘటనా స్థలాన్ని వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రత్యామ్నాయ వసతి కల్పించిన తర్వాతే ఇళ్ల తొలగింపు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.మొత్తంగా ఈ ఘటన గుంటూరులో హాట్ టాపిక్‌గా మారగా, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## మళ్లీ కేసీఆర్ రావాలి".. కాంగ్రెస్‌పై మధుప్రియ కామెంట్స్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ జానపద గాయని మధుప్రియ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె పాటలతో కాకుండా రాజకీయ వ్యాఖ్యలతో చర్చకు దారితీశారు. జగిత్యాలలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్న మధుప్రియ, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై ప్రశంసలు కురిపించడంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ'గా నిర్వహించిన ఈ సమావేశంలో మధుప్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె ఆలపించిన జానపద గీతాలకు సభకు హాజరైన ప్రజలు ఉత్సాహంగా స్పందించారు. ముఖ్యంగా "మళ్లీ కేసీఆర్ పాలన రావాలి" అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో హర్షధ్వానాలు రేపగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.సభ అనంతరం మీడియాతో మాట్లాడిన మధుప్రియ, "తెలంగాణ ప్రజలకు కేసీఆర్ ఒక



భావోద్వేగం. రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను ఎవరూ మరచిపోలేరు" అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తనకు కేసీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తుచేశారు.అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయి. కూల్చివేతలు అధికమయ్యాయి. కేసీఆర్ హయాంలో రాష్ట్రం మెరుగ్గా ఉండేది" అని వ్యాఖ్యానించారు. అంతేకాక, "తాను ఎప్పుడూ కేసీఆర్ పక్షాననే ఉంటాను. ఇతర పార్టీల కోసం పాటలు పాడను" అంటూ స్పష్టం చేశారు.మధుప్రియ ప్రస్థానం విషయానికి వస్తే, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఆమె చిన్న వయసులోనే జానపద గీతాలతో మంచి గుర్తింపు పొందారు. 'ఆడపిల్లనమ్మ నేను ఆడపిల్లనాని' పాటతో ప్రజాదరణ పొందిన ఆమె, అనంతరం సినీరంగంలోకి ప్రవేశించి పలు హిట్ పాటలతో గుర్తింపు సంపాదించారు. 'వచ్చిండే' పాట ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. అలాగే బిగ్‌బాస్ సీజన్ 1లో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. ఇటీవల కాళేశ్వర ఆలయంలో పాట చిత్రీకరణ వివాదంతో వార్తల్లో నిలిచిన మధుప్రియ, ఇప్పుడు రాజకీయ వ్యాఖ్యలతో మళ్లీ హాట్ టాపిక్‌గా మారారు.

## కొండపై రద్దీ.. శ్రీవారి దర్శనానికి 6 గంటలు

**తిరుమల (ఏడీఎన్ఎన్):**

వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో సర్వ దర్శనానికి గణనీయమైన సమయం పడుతోంది. టీటీడీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం పొందేందుకు సుమారు 6 గంటల సమయం పడుతోంది. దర్శనం కోసం వేచి ఉన్న భక్తులతో ఇప్పటికే 12 కంపార్ట్ మెంట్లు నిండిపోయాయి.సోమవారం ఒక్కరోజే 80,084 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 28,929 మంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.69 కోట్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. వేసవి రద్దీ మరింత పెరిగే అవకాశమున్నందున, దర్శనానికి వచ్చే భక్తులు ముందస్తు ప్రణాళికతో రావాలని టీటీడీ సూచించింది.



## బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. ఇద్దరు మృతి

**రంగారెడ్డి (ఏడీఎన్ఎన్):**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని డీసీఎం వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు మృతిచెందారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వనస్థలిపురం సాహెబ్‌గూడకు చెందిన కొమ్మగోని ప్రశాంత్ గౌడ్ (41) విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై రావిర్యాల సమీపంలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి దర్శనార్థం బయలుదేరారు.ఈ క్రమంలో రావిర్యాల -వాండర్ల సమీపంలో వెళ్తుండగా వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ గౌడ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆయన కుమారుడు శ్రీతన్ (11) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ప్రమాదంలో గాయపడిన భార్య, మరో చిన్నారిని తక్షణమే తుక్కుగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారికి స్వల్ప గాయాలే అయినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఆదిబట్ల సీఐ రవికుమార్ వెల్లడించారు.




## జీవీఎంసీ కమిషనర్ వాట్సాప్ హ్యాక్!

**విశాఖపట్నం(ఏడీఎన్ఎన్):**

విశాఖ నగరంలో సైబర్ కేటుగాళ్లు బరితెగించారు. సామాన్యులే లక్ష్యంగా సాగే వీరి మోసాలు ఇప్పుడు ఏకంగా ఉన్నతాధికారుల స్థాయికి చేరాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ వాట్సాప్ నంబర్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఆయన పేరుతోనే ఆర్థిక వసూళ్లకు తెరలేపడం నగరంలో కలకలం సృష్టించింది. నేరగాళ్లు కమిషనర్ వాట్సాప్ నంబర్‌ను ఆధీనంలోకి తీసుకుని, ఆయన అధికారిక ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకున్నారు. తర్వాత కమిషనర్‌కు తెలిసిన అధికారులు, సిబ్బంది , ఇతర ప్రముఖులకు వరుసగా మెసేజ్‌లు పంపారు. "నేను ఒక అత్యవసర పనిలో ఉన్నాను.. తక్షణమే కొంత డబ్బు అవసరమైంది, ఈ నంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయండి," అంటూ సందేశాలు పంపడం ప్రారంభించారు. ఉన్నతాధికారి నుంచి మెసేజ్ రావడంతో కొందరు సిబ్బంది మొదట ఆందోళనకు గురయ్యారు.ఈ విషయం తన దృష్టికి రావడంతో జీవీఎంసీ కమిషనర్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఇది తన వాట్సాప్ నంబర్ ద్వారా జరుగుతున్న సైబర్ దాడి అని గుర్తించి, తక్షణమే అధికారిక ప్రకటన విడుదల చేశారు. "నేను ఎవరికీ డబ్బులు కావాలని మెసేజ్‌లు పంపడం లేదు. నా పేరుతో వచ్చే ఇటువంటి నకిలీ సందేశాలను ఎవరూ నమ్మవద్దు. ఎటువంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించి మోసపోవద్దు," అని ప్రజలను, అధికారులను ఆయన కోరారు. అనుమానాస్పదంగా ఉన్న మెసేజ్‌లపై వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.



కమిషనర్ ఫిర్యాదుతో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ హ్యాకింగ్ ఎక్కడ నుంచి జరిగింది? ఏ ఐపీ అడ్రస్ ద్వారా నేరగాళ్లు వాట్సాప్‌ను యాక్సెస్ చేశారు? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకునేందుకు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ప్రజలకు పోలీసుల సూచనలు:తెలియని నంబర్ల నుంచి లేదా తెలిసిన వారి పేరుతో అకస్మాత్తుగా డబ్బులు అడుగుతూ మెసేజ్‌లు వస్తే వెంటనే స్పందించవద్దు.అటువంటి సందర్భాల్లో నేరుగా సదరు వ్యక్తికి ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి.వాట్సాప్‌లో 'టూ స్టెప్ వెరిఫికేషన్' ఎనేబుల్ చేసుకోవడం ద్వారా హ్యాకింగ్ బారిన పడకుండా ఉండవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.నగరంలో కీలకమైన బాధ్యతల్లో ఉన్న అధికారి నంబర్‌నే హ్యాక్ చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు

## ఔటర్ రింగ్ రోడ్డుతో రైతుల పొట్ట కొట్టడమే

**విజయవాడ:**

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో ప్రభుత్వం రైతుల నుంచి నిర్బంధంగా భూములు సేకరించాలని చూడటంపై మాజీ మంత్రి, సీనియర్ రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం విజయవాడలో నిర్వహించిన 'అమరావతి రింగ్ రోడ్డు ప్రభావిత గ్రామాల రైతుల సదస్సు'లో ఆయన పాల్గొన్నారు. ఐదు జిల్లాల నుండి తరలివచ్చిన రైతులతో కలిసి ఆయన ఈ ప్రాజెక్టు వల్ల కలుగుతున్న ఇబ్బందులపై గళమెత్తారు. దేశంలోని పెద్ద పెద్ద నగరాల్లోనే లేని ఔటర్ రింగ్ రోడ్డు అమరావతిలో ఎందుకని వడ్డే ప్రశ్నించారు. "అమరావతిలోని 29 గ్రామాల్లో ఉన్న జనాభా ఎంత? ఈ 12 ఏళ్లలో పెరిగిన జనాభా ఎంత? కనీస అవసరం లేకున్నా రూ. 24,700 కోట్లతో ఈ ప్రాజెక్టును ఎందుకు చేపడుతున్నారు? ఇది



ఎవరి ప్రయోజనాల కోసం?," అని ఆయన నిలదీశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించమంటే నిధులు లేవంటున్న ప్రభుత్వం, వేల కోట్లు రోడ్ల కోసం ఎలా వెచ్చిస్తోందని అచ్చెన్నాయుడు వ్యాఖ్యలను గుర్తు చేస్తూ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరును తప్పుబడుతూ వడ్డే ఘాటు వ్యాఖ్యలు చేశారు. "189 కిలోమీటర్ల ఈ రింగ్ రోడ్డు మీ ప్రైవేట్ ప్రాపర్టీ అనుకుంటున్నారా? లేక మీ హెరిటేజ్ కంపెనీ విస్తరణ అనుకుంటున్నారా? రైతు ప్రాణం మీకు చీమలు, దోమల్లా కనిపిస్తోందా?," అని ప్రశ్నించారు. విజయవాడకు ఇప్పటికే వెస్ట్ బైపాస్ అందుబాటులో ఉండగా, మళ్లీ కొత్తగా ఈ రోడ్డు ఎందుకని అధికారుల ఆలోచనను తప్పుబట్టారు.జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర నిబంధనల ప్రకారం 70 మీటర్ల వెడల్పు సరిపోతుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 140 నుండి 250 మీటర్ల మేర భూమిని సేకరించాలని చూడటం వెనుక అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. రైతుల పొట్ట కొట్టి కొంతమంది స్వార్థం కోసం చేసే ఈ ప్రయత్నాలను సహించేది లేదని, భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణకు 8 కొత్త రైళ్లు

- **కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి ప్రారంభం**
- **మే నుంచి జూలై మధ్య దశల వారీగా పరుగులు!**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో రైల్వే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చింది. రాష్ట్రం నుంచి దేశంలోని వివిధ నగరాలకు ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా 8 కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరాలను వెల్లడిస్తూ, తెలంగాణకు ఈ స్థాయి ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త రైళ్లు



హైదరాబాద్‌లోని ప్రధాన స్టేషన్లైన కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి బయలుదేరుతాయి. ఇవి దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక మరియు పర్యాటక కేంద్రాలైన తిరుపతి, తిరుచానూరు, భువనేశ్వర్, జైపూర్, శ్రీ గంగానగర్ వంటి నగరాలను అనుసంధానిస్తాయి. వారానికి ఒకసారి నడిచే ఈ రైళ్ల వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీ గణనీయంగా తగ్గనుంది. ఈ ఎనిమిది రైళ్లు మే నెల నుంచి జూలై నెల మధ్య దశల వారీగా ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా వేసవి సెలవుల దృష్ట్యా తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు, ఉత్తరాది నగరాలకు వెళ్లే పర్యాటకులకు ఇవి ఎంతో ఊరటనివ్వనున్నాయి. చర్లపల్లి రైల్వే టెర్మినల్ అందుబాటులోకి వస్తున్న తరుణంలో అక్కడి నుంచి కూడా కొత్త సర్వీసులు ప్రారంభం కావడం విశేషం.




## వీధి కుక్కల దాడులపై హెచ్ఆర్సీ ఉక్కుపాదం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు హద్దుమీరిపోతుండటం మరియు పసిప్రాణాలు బలి అవుతుండటంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల పెద్దపల్లి , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగిన రెండు భయానక ఘటనలను కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో మూడేళ్ల చిన్నారి 'దివ్య బెహరా'ను కుక్కలు విచక్షణా రహితంగా పీక్కు తిన్న ఘటనపై కమిషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడింది.ఈ ఉదంతాలపై స్పందిస్తూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి కల్పించబడిన 'జీవించే హక్కు' ఇక్కడ తీవ్రంగా ఉల్లంఘించబడిందని కమిషన్ వ్యాఖ్యానించింది. వీధి కుక్కలను నియంత్రించడంలో స్థానిక సంస్థలు, మున్సిపల్ అధికారులు విఫలమవడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, సామాన్య ప్రజల భద్రత గాలిలో దీపంలా మారిందని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.చివరగా, ఈ మరణాలకు గల కారణాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు మరియు బాధ్యులపై తీసుకున్న చర్యల గురించి పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని పెద్దపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్లకు హెచ్ఆర్సీ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణిస్తూ, తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది. అప్పటిలోగా మున్సిపల్ యంత్రాంగం తీసుకున్న నివారణ చర్యలను కూడా నివేదికలో పొందుపరచాలని స్పష్టం చేసింది.



## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**జగిత్యాల (ఏడీఎన్ఎన్):**

జగిత్యాల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొప్పదండి నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడు మొగిలి పాలెం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగాలని అంజనేయస్వామిని ప్రార్థించారు.ఇటీవలి కాలంలో సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్న పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని సంకల్పంతో ప్రత్యేక అర్చనలు, పూజలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తడగొండ నర్సింగ్ బాబు, దూడం శ్రీనాథ్, కనకట్ల శ్రీనివాస్, మహమ్మద్ షాబీర్, కైర లక్ష్మణ్, జక్కని అఖిల్, జుంగవేణి రాజు, చిలివేరి సాయి, కాయిత రమేష్, శ్యామ్, ఒడ్నాల సాయి, అయిలాపురం సాయికృష్ణ, మద్దివేణి సాయికుమార్, మారంపెల్లి రాజు, గుడ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.



## డీసీపీకి పాడైపోయిన కీమా.. రెస్టారెంట్ బండారం బహిర్గతం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్ నగరంలో ఆహార భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తేలా చేసిన ఘటన వెలుగుచూసింది. ప్రముఖ రెస్టారెంట్ నుంచి సరఫరా చేసిన పాచిపోయిన మటన్ కీమా వ్యవహారం సంచలనంగా మారింది. ఈ ఘటనపై స్పందించిన అధికారులు తక్షణమే దాడులు నిర్వహించగా, ఆహార నాణ్యతపై ఆందోళన కలిగించే అంశాలు బయటపడ్డాయి. పోలీసు డిప్యూటీ కమిషనర్ (డీసీపీ) ముత్యం రెడ్డి ఇటీవల 'జొమాటో' ద్వారా జూబ్లీహిల్స్‌లోని ఒక ప్రముఖ రెస్టారెంట్ నుంచి మటన్ కీమా ఆర్డర్ చేశారు. ఇంటికి చేరిన ఆహారాన్ని పరిశీలించగా తీవ్రమైన దుర్వాసన రావడంతో అది పాచిపోయినదిగా గుర్తించారు. దీంతో ఆయన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు.సమాచారం అందుకున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి సదరు రెస్టారెంట్‌పై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వంటగదిలో నిల్వ ఉంచిన పాచిపోయిన మటన్ బయటపడింది. అదే మాంసంతో వంటలు సిద్ధం చేసి వినియోగదారులకు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఇటీవల నెలరోజుల వ్యవధిలోనే నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన దాడుల్లో సుమారు 129 టన్నుల కుళ్లిపోయిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ, కొంతమంది వ్యాపారుల నిర్లక్ష్య ధోరణి మారడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది.కేవలం మాంసం మాత్రమే కాకుండా పాలు, నూనెలు, మసాలా పదార్థాల్లోనూ కల్తీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరవాసులు ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



ఐపీఎల్ 'ఎలైట్ క్లబ్'లో

# తిలక్ వర్మ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026 సీజన్‌లో తెలుగు క్రికెట్ స్టార్ తిలక్ వర్మ అరుదైన రికార్డుతో చరిత్ర సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో తిలక్ కేవలం 45 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలవడమే కాకుండా, ప్రత్యర్థి జట్టు మొత్తాన్ని తన వ్యక్తిగత స్కోరు కంటే తక్కువకే కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ చరిత్రలో ఒక బ్యాటర్ చేసిన సెంచరీ స్కోరును ప్రత్యర్థి జట్టు దాటలేకపోవడం ఇది 9వ సారి. ఎలైట్ క్లబ్‌లో క్రిస్ గేల్, విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెక్‌కల్లమ్ వంటి దిగ్గజాల సరసన తిలక్ వర్మ చేరాడు. తిలక్ వర్మ మెరుపులతో ముంబై 199 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 100 పరుగులకే కుప్పకూలింది. దీంతో ముంబై 99 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. గతంలో 2008 తొలి ఐపీఎల్ మ్యాచ్‌లోనే బ్రెండన్ మెక్‌కల్లమ్ 158 పరుగులు చేయగా, ఆనాడు ఆర్సీబీ జట్టు కేవలం 82 పరుగులకే అవుటైంది. అప్పటి నుంచి రాహుల్ ద్రవిడ్, క్రిస్ గేల్, విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్, జానీ బెయిర్‌స్టో, కేఎల్ రాహుల్ మాత్రమే ఈ ఘనత సాధించారు. వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న ముంబై ఇండియన్స్ కు తిలక్ వర్మ ఇన్నింగ్స్ కొత్త ఊపిరి పోసింది. ముఖ్యంగా శుభ్‌మన్ గిల్ వంటి మేటి ఆటగాళ్లు ఉన్న గుజరాత్ జట్టును తిలక్ ఒక్కడే తన స్కోరుతో ఓడించినంత పని చేయడం విశేషం. ఐపీఎల్ 2026లో ఇదే అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన అని క్రికెట్ పండితులు అభివర్ణిస్తున్నారు. తిలక్ వర్మ భవిష్యత్తులో భారత జట్టులో కూడా ఇదే తరహా నిలకడైన ప్రదర్శన కనబరుస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# సన్ రైజర్స్ కు విజయాభిషేకం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ సొంత గడ్డపై జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ తో మంగళవారం జరిగిన పోరులో హైదరాబాద్ బ్యాటర్లు ఊచకోత కోశారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేశారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లను కట్టడి చేసి ఘన విజయాన్ని అందుకున్నారు. ఈ మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణ యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. మొదటి బంతి నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డ అభిషేక్, ఉప్పల్ మైదానాన్ని ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించారు. కేవలం మెరుపు వేగంతో సెంచరీ పూర్తి చేయడమే కాకుండా, ఇన్నింగ్స్ ముగిసే వరకు క్రీజులో ఉండి 135 పరుగులతో అజేయంగా నిలిచారు. ఢిల్లీ బౌలర్లలో ఎవరినీ వదలకుండా స్టేడియం నలుమూలల బంతిని తరలిస్తూ ఆయన చేసిన విన్యాసాలు అభిమానులకు కనువిందు చేశాయి. అభిషేక్‌కు తోడుగా ఇతర బ్యాటర్లు కూడా తమ వంతు పాత్రను అద్భుతంగా పోషించారు. పవర్ ప్లేలో ట్రావిస్ హెడ్ (37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (25) కూడా దూకుడుగా ఆడుతూ ఇన్నింగ్స్ వేగాన్ని తగ్గనివ్వలేదు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (37) తన 'ఫినిషింగ్' మార్క్ చూపిస్తూ భారీ షాట్లతో స్కోరును 242 మార్కుకు చేర్చారు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్కడే ఒక వికెట్ పడగొట్టగా, మిగిలిన వారంతా ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. 243 పరుగుల హిమాలయమంత లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్.. సన్‌రైజర్స్ బౌలర్ల ధాటికి తడబడింది. హైదరాబాద్ బౌలర్ ఈషాన్ మలింగ 4 వికెట్లతో ఢిల్లీ నడ్డి విరిచారు. ఢిల్లీ బ్యాటర్లలో నితీష్ రాణా (57), సమీర్ రిజ్వీ (41) పోరాడినప్పటికీ, భారీ లక్ష్య ఛేదనలో వారి ప్రయత్నాలు ఫలించలేదు. హర్ష్ దూబే కూడా 3 వికెట్లతో రాణించడంతో హైదరాబాద్ ఘనవిజయం ఖాయమైంది.




| Team | | M | W | L | NRR | Pts |
|---|---|---|---|---|---|---|
| 1 | PBKS | 6 | 5 | 0 | +1.420 | 11 |
| 2 | RCB | 6 | 4 | 2 | +1.171 | 8 |
| 3 | SRH | 7 | 4 | 3 | +0.820 | 8 |
| 4 | RR | 6 | 4 | 2 | +0.599 | 8 |
| 5 | DC | 6 | 3 | 3 | -0.130 | 6 |
| 6 | GT | 6 | 3 | 3 | -0.821 | 6 |
| 7 | MI | 6 | 2 | 4 | +0.067 | 4 |
| 8 | CSK | 6 | 2 | 4 | -0.780 | 4 |
| 9 | LSG | 6 | 2 | 4 | -1.173 | 4 |
| 10 | KKR | 7 | 1 | 5 | -0.879 | 3 |




భారత అథ్లెటిక్స్ కు

# 'డోపింగ్' షాక్

**అత్యంత ప్రమాదకర దేశంగా భారత్!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత అథ్లెటిక్స్ ను పట్టిపీడిస్తున్న డోపింగ్ సమస్యపై ప్రపంచ అథ్లెటిక్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా నమోదవుతున్న రికార్డు స్థాయి ఉల్లంఘనల నేపథ్యంలో, భారత్‌ను 'అత్యంత ప్రమాదకర డోపింగ్ దేశంగా' అథ్లెటిక్స్ సమగ్రత విభాగం (AIU) గుర్తించింది. నిబంధనల ప్రకారం, గతంలో కేటగిరీ 'బి'లో ఉన్న భారత అథ్లెటిక్స్ సమాఖ్య (AFI)ను, ఇప్పుడు అత్యంత ముప్పు ఉన్న కేటగిరీ 'ఎ' లోకి మారుస్తూ AIU బోర్డు నిర్ణయం తీసుకుంది. భారత అథ్లెట్లు ఇకపై అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలంటే మరింత కఠినమైన డోపింగ్ నిరోధక పరీక్షలను ఎదుర్కోవాలి. జాతీయ జట్టులోని ప్రతి అథ్లెట్‌కు కనీస స్థాయిలో డోపింగ్ పరీక్షలు నిర్వహించడం ఇప్పుడు తప్పనిసరి. గత నాలుగేళ్లలో భారత్‌లో నమోదైన డోపింగ్ ఉల్లంఘనల వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కెన్యా వంటి దేశాలను వెనక్కి నెట్టి భారత్ అగ్రస్థానానికి చేరుకుంది. ప్రస్తుతం భారత్ నుంచి మొత్తం 148 మంది అథ్లెట్లు అనర్హులుగా ఉన్నట్లు ఏఐయూ పేర్కొంది. 2022 నుంచి 2025 మధ్య కాలంలో అథ్లెటిక్స్ లో అత్యధిక డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనలు జరిగిన దేశాల్లో భారత్ మొదటి రెండు స్థానాల్లో నిలిచింది.

# చెన్నైకి షాక్.. ఆయుష్ మాత్రే ఔట్!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మరో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే గాయం కారణంగా ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ మాత్రే గాయపడ్డాడు. 195 పరుగుల ఛేదనలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ఈ 18 ఏళ్ల యువ ఆటగాడు, కేవలం 12 బంతుల్లో 30 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఐదో ఓవర్‌లో రెండో పరుగు కోసం ప్రయత్నిస్తుండగా ఇతని ఎడమ కాలికి తీవ్రమైన గాయమైంది. గాయం



తీవ్రత దృష్ట్యా అతను మళ్లీ మైదానంలోకి రావడానికి 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు. ఈ సీజన్‌లో సీఎస్కే టోర్నీ నుంచి తప్పుకున్న మూడో ఆటగాడు ఆయుష్ మాత్రే. ఇప్పటికే ఖలీల్ అహ్మద్ గాయంతో బౌలింగ్ విభాగానికి దూరం కాగా.. మరో స్టార్ బౌలర్ నాథన్ ఎల్లిస్ కూడా టోర్నీకి దూరం అయ్యారు. ఇప్పటికే ఆడిన 6 మ్యాచ్ లకు కేవలం 4 పాయింట్లతో పట్టికలో 7వ స్థానానికి పడిపోయింది. తన తదుపరి మ్యాచ్ లో గురువారం నాడు చిరకాల ప్రత్యర్థి ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. "ఆయుష్ వంటి మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాడు దూరం కావడం జట్టుకు పెద్ద లోటు. యువ ప్రతిభావంతుడిని కోల్పోవడం నిరాశ కలిగిస్తోంది." అని సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ విచారం వ్యక్తం చేశారు.




అమెజాన్‌కు

# 'రీఫండ్' సెగ

**మిలియన్ డాలర్ల స్కామ్‌పై కోర్టుకు వెళ్లిన టెక్ దిగ్గజం!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ రీఫండ్ మోసానికి పాల్పడుతున్న ముఠాపై యుద్ధం ప్రకటించింది. ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఈ స్కామ్ వల్ల కంపెనీ మిలియన్ల డాలర్ల నష్టాన్ని చవిచూసింది. దీనిపై అమెజాన్ ఇప్పటికే కోర్టులో దావా వేసింది. మోసగాళ్లు ఒక పక్కా ప్లాన్ ప్రకారం అమెజాన్‌ను బురిడీ కొట్టిస్తున్నారు. మొదట ల్యాప్‌టాప్‌లు, హైఎండ్ గ్రాఫిక్ కార్డ్స్ వంటి ఖరీదైన వస్తువులను ఆర్డర్ చేస్తారు. వస్తువు డెలివరీ అయిన తర్వాత, బాక్స్ ఖాళీగా ఉందని లేదా వస్తువు పాడైపోయిందని కంపెనీకి ఫిర్యాదు చేస్తారు. అమెజాన్ రిటర్న్ పాలసీని అడ్డుపెట్టుకుని, అసలు వస్తువును తమ వద్దే ఉంచుకుని పూర్తి డబ్బును వెనక్కి పొందుతారు. ఈ మోసాన్ని అరికట్టేందుకు అమెజాన్ భారీగా వెచ్చిస్తోంది. ఈ స్కామ్‌ను ఛేదించడానికి అమెజాన్ ఇప్పటివరకు సుమారు 75,000 డాలర్లు అంటే సుమారు రూ. 62 లక్షలకు పైగా ఖర్చు చేసింది. ఇలాంటి న్యాయపరమైన చర్యల కోసం తాము వెచ్చించిన ఈ మొత్తాన్ని మోసగాళ్ల నుంచే వసూలు చేసి తమకు ఇప్పించాలని అమెజాన్ కోర్టును కోరింది. భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా అమెజాన్ తన భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోంది. అనుమానాస్పద రిటర్న్ అభ్యర్థనలను గుర్తించడానికి అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్‌ను ఉపయోగిస్తోంది. కేవలం అకౌంట్లను బ్లాక్ చేయడమే కాకుండా, క్రిమినల్ చర్యలకు కూడా వెనకాడబోమని కంపెనీ స్పష్టం చేసింది.


# టెస్లాలో భారీగా కొలువుల జాతర

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా (Tesla) భారత మార్కెట్లో తన ఉనికిని చాటుకునేందుకు భారీ ప్రణాళికలతో సిద్ధమైంది. కేవలం కార్ల విక్రయాలకే పరిమితం కాకుండా, ఏఐ (AI), సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ ఇంజనీరింగ్ వంటి విభిన్న రంగాల్లో నియామకాలు చేపడుతూ భారత్‌ను తన గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. టెస్లా దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు, పూణే, కొచ్చి వంటి ప్రధాన నగరాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. టెస్లా కేవలం ఆటోమొబైల్ కంపెనీగానే కాకుండా టెక్ దిగ్గజంగా భారత్‌లో అడుగుపెడుతోంది.




'డోజో' వంటి శక్తివంతమైన సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థల కోసం ఏఎస్ఐసీ, సైట్ రిలయబిలిటీ ఇంజనీర్లను నియమించుకుంటోంది. రోబోటిక్స్, అటానమస్ డ్రైవింగ్ కోసం అవసరమైన న్యూరల్ నెట్వర్క్ ట్రైనింగ్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. భారతదేశంలో స్థానిక తయారీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. లిథియం ఐరన్ ఫాస్ఫేట్, నికెల్ మాంగనీస్ కోబాల్ట్ వంటి బ్యాటరీ మెటీరియల్స్ పై పనిచేసే నిపుణులను ఆహ్వానిస్తోంది. వాహనాల్లోని ఇన్ఫోటైన్మెంట్, పవర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ కోసం పీసీబీ లేఅవుట్ ఇంజనీర్లను నియమిస్తోంది. సేల్స్, సర్వీస్ విభాగాలతో పాటు, టెస్లా తన ప్రోటోటైప్ వాహనాల డేటా సేకరణ కోసం ప్రత్యేకంగా డ్రైవర్లను కూడా నియమించుకుంటోంది. ఇది త్వరలోనే భారత రోడ్లపై టెస్లా కార్లు పరుగులు తీయబోతున్నాయనే సంకేతాన్ని ఇస్తోంది.



యాపిల్ కొత్త సీఈవోగా

# జాన్ టర్నెస్

**ముగిసిన టిమ్ కుక్ శకం**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టెక్ దిగ్గజం యాపిల్ తన నాయకత్వంలో చారిత్రాత్మక మార్పును ప్రకటించింది. గత 15 ఏళ్లుగా కంపెనీని విజయపథంలో నడిపించిన టిమ్ కుక్ సీఈవో పదవి నుంచి తప్పుకోనున్నారు. ఆయన స్థానంలో హార్డ్వేర్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టర్నెస్ నూతన సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జాన్ టర్నెస్ సీఈవోగా బాధ్యతలు చేపడతారు. సీఈవో పదవి నుంచి తప్పుకున్నాక, టిమ్ కుక్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. చీఫ్ హార్డ్వేర్ ఆఫీసర్‌గా జానీ బ్రౌజీ, హార్డ్వేర్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ బాధ్యతలు టామ్ మెరీబు స్వీకరిస్తారు. ఇటీవల మార్కెట్ విలువలో యాపిల్‌ను అధిగమించిన చిప్ దిగ్గజం ఎన్విడియా (Nvidia) తో పోటీ పడటమే లక్ష్యంగా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 'సప్లై చైన్' మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టిన యాపిల్, ఇకపై హార్డ్వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వైపు వేగంగా అడుగులు వేయనుంది. 2001లో యాపిల్‌లో చేరిన టర్నెస్ (50), ఐప్యాడ్, ఎయిర్‌పాడ్స్, మ్యాక్ వంటి కీలక ఉత్పత్తుల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించారు. మ్యాక్ విభాగంలో 'ప్రో' సిరీస్‌ను విజయవంతం చేసిన ఘనత ఆయనది. 2011లో బాధ్యతలు చేపట్టిన కుక్ హయాంలో యాపిల్ షేరు విలువ 20 రెట్లు పెరిగి, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్థిక సంస్థగా అవతరించింది. ఇప్పుడు టర్నెస్ నాయకత్వంలో యాపిల్ 'ఏఐ' యుగంలోకి ఎలా దూసుకెళ్తుందో చూడాలి.

భారత చెస్‌లో

# కొత్త గ్రాండ్ మాస్టర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



భారత చెస్ రంగానికి మరో నూతన గ్రాండ్ మాస్టర్ (GM) లభించాడు. బెంగాల్‌కు చెందిన 22 ఏళ్ల అరోణ్యక్ ఘోష్, బ్యాంకాక్ చెస్ క్లబ్ ఓపెన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసి, తన చిరకాల స్వప్నమైన గ్రాండ్ మాస్టర్ హోదాను ఖరారు చేసుకున్నాడు. బ్యాంకాక్ ఓపెన్‌లో నిర్ణీత 9 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి, సంయుక్తంగా అగ్రస్థానంలో నిలవడంతో పాటు జీఎం హోదాకు అవసరమైన మూడో నార్మ్‌ను పూర్తి చేశాడు. ప్రస్తుతం అరోణ్యక్ 2533 ఎలో రేటింగ్ పాయింట్లతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 401వ స్థానంలో ఉన్నాడు. అరోణ్యక్ కేవలం క్లాసికల్ చెస్‌లోనే కాకుండా ర్యాపిడ్ ఫార్మాట్‌లో జాతీయ ఛాంపియన్‌గా కూడా ఉన్నాడు. గత ఏడాది ప్రపంచకప్ టోర్నీలో పాల్గొన్న ఇతను, తొలి రౌండ్‌లో పోలాండ్‌కు చెందిన బార్టెల్‌ను ఓడించి అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండేళ్ల నిరీక్షణ తర్వాత దేశానికి మరో గ్రాండ్ మాస్టర్ హోదాను తెచ్చిపెట్టిన అరోణ్యక్‌పై క్రీడా లోకం ప్రశంసలు కురిపిస్తోంది.




# దేశంలోనే తొలి 'LED' క్రెడిట్ కార్డ్

**ట్యాప్ చేస్తే వెలిగేలా వినూత్న ఫీచర్!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ బ్యాంకింగ్ రంగంలో సరికొత్త విప్లవం మొదలైంది. ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ 'చెక్', ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సంయుక్తంగా దేశంలోనే మొదటి LED క్రెడిట్ కార్డును ఆవిష్కరించాయి. షాపింగ్ మాల్స్ లేదా స్టోర్లలో పేమెంట్ చేసేటప్పుడు 'ట్యాప్ టు పే' చేయగానే కార్డులో అమర్చిన LED దీపాలు వెలుగుతాయి. ఈ కార్డులో ఎటువంటి బ్యాటరీ ఉండదు. పేమెంట్ మెషీన్ నుండి వచ్చే సిగ్నల్స్ ఆధారంగానే ఈ దీపాలు పని చేస్తాయి. ఈ నెల 28వ తేదీ నుంచి కొత్త కార్డుల కోసం యూజర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. చెల్లింపు ప్రక్రియను మరింత ఆకర్షణీయంగా, ఆధునికంగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్డును రూపొందించారు. చెక్ ప్రతినిధి ఆదిత్య సోని, ఏయూ బ్యాంక్ ప్రతినిధి సంజయ్ అగర్వాల్ ఈ కార్డును లాంచ్ చేస్తూ.. ఇతర కార్డుల్లోని లోపాలను సవరిస్తూ, కస్టమర్లకు ఒక సరికొత్త అనుభూతిని అందించడానికి ఈ వినూత్న సాంకేతికతను జోడించినట్లు తెలిపారు.



వెండి ధర

# భారీ పతనం

**ఒక్కరోజే రూ.10 వేలు డౌన్**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా పెరిగిన వెండి ధరలకు భారీ బ్రేక్ పడింది. ఏప్రిల్ 21న వెండి కొనుగోలుదారులకు భారీ ఊరట లభించింది. మంగళవారం ఉదయం కిలో వెండి ధర రూ. 2,75,000 ఉండగా, కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే ఉదయం 11 గంటలకు ఏకంగా రూ. 10,000 తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,65,000 వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్, చెన్నై, కేరళ రాష్ట్రాల్లో మాత్రం ధర ఇంకా రూ. 2,75,000 వద్దే కొనసాగుతోంది. బంగారం ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో మారుతున్న ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పసిడి, వెండి ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటీవల విపరీతంగా పెరిగిన ధరలు ఇప్పుడు క్రమంగా తగ్గుముఖం పట్టడం గమనార్హం. కొన్ని వారాల క్రితం కిలో వెండి రూ. 4 లక్షల వరకు వెళ్లి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించగా, ఇప్పుడు దాదాపు లక్ష రూపాయలకు పైగా తగ్గడం కొనుగోలుదారులకు పెద్ద ఊరట. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,55,290 ఉండగా.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,42,350 గా ఉంది. ఇరాన్, ఇతర ప్రాంతాల్లో ఉద్రిక్తతల వల్ల క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, తద్వారా ద్రవ్యోల్బణ భయాలు ధరలపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్నప్పటికీ, ధరలు మరీ ఎక్కువగా ఉండటంతో డిమాండ్ తగ్గడం కూడా ఒక కారణం కావచ్చు.

# స్టాక్ మార్కెట్ 'హ్యాట్రిక్' లాభాలు

**మొదటిపేజీ తరువాయి...**

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం అదిరిపోయే లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు, ముఖ్యంగా అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు మొదలయ్యే అవకాశాలు ఉండటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీనికి తోడు ముడిచమురు ధరలు తగ్గడం కూడా మార్కెట్లకు ఊపునిచ్చింది. వరుసగా మూడో రోజు కూడా సూచీలు లాభాల బాట పట్టాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు మార్కెట్ ను పరుగులు పెట్టించాయి. సెన్సెక్స్ 753.03 పాయింట్లు లాభపడి 79,273.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 211.75 పాయింట్ల లాభంతో 24,576.60 స్థాయి వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 33 పైసలు క్షీణించి 93.49 వద్ద నిలిచింది. ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్ డీఎఫ్సీ బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. బీఈఎల్, టైటాన్, రిలయన్స్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ పసిడి ధరలు అంతర్జాతీయంగా 4781 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. శాంతి చర్చలపై ఆశావహ దృక్పథం కొనసాగితే, మార్కెట్లు ఇదే జోరును వచ్చే సెషన్లలోనూ కొనసాగించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 94.70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. చమురు ధరలు తగ్గడం భారత్ వంటి దిగుమతి చేసుకునే దేశాలకు సానుకూల అంశంగా చెప్పవచ్చు.

సంక్షేమ మనసర్కార్ | Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
22.04.2026
www.manasarkar.com



# రూల్స్ బ్రేక్..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


ఇప్పుడు లేడీ సూపర్ స్టార్ నయనతార మునుపటిలా లేదు. గతంలో మూవీ ఓపెనింగ్స్, ప్రమోషన్స్ చేయనంటూ బెట్టు చేసేది. మీడియాకు ఇంటర్వ్యూస్ ఇచ్చేది కాదు. నౌ ఆ రూల్స్ బ్రేక్ చేస్తోంది. కెరీర్ విషయంలో కూడా అంతే నేను లేడీ సూపర్ స్టార్‌ను కదా టైర్ 1 హీరోలతోనే జోడీ కడతానని గిరిగీసుకొని కూర్చోవట్లేదు. సీనియర్స్ సీనియర్సే జూనియర్స్ జూనియర్సే అంటోంది భామ. నయనతార పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ విషయంలో చాలా ఛేంజస్ కనిపిస్తున్నాయి. గతంలో యాడ్స్ చేసేది కాదు మూవీ ఓపెనింగ్స్‌కు వచ్చేది కాదు.. ప్రమోషన్స్ చేసేది కాదు. ఇక మీడియా ఇంటరాక్షన్ అంటే పూర్తిగా స్కిప్ చేసేది. కానీ విఘ్నేశ్ శివన్ రాకతో ఆమెలో చాలా మార్పులే కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న రూల్స్‌కు బ్రేక్ చేసి ఓపెనింగ్స్, ప్రమోషన్స్ చేస్తోంది. ప్రస్తుతానికి ప్రీ రిలీజ్ ఈవెంట్స్ స్కిప్ చేస్తున్న లేడీ సూపర్ స్టార్ ఫ్యూచర్‌లో రీసెంట్లీ జరిగిన లవ్ ఇన్స్యురెన్స్ కంపెనీ ఆడియో ఫంక్షన్‌లా తళుక్కున మెరిసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కెరీర్ పరంగా కూడా దూకుడు ప్రదర్శిస్తోంది లేడీ సూపర్ స్టార్. తాను స్టార్ హీరోయిన్ రేంజ్ కు వెళ్లిపోయానని కేవలం టైర్ వన్ హీరోలతోనే జోడీ కడతానని భీష్మించుకోలేదు నయన్. ఒక వైపు సీనియర్స్ తో జోడీ కడుతూనే మరో వైపు యంగ్ బాయ్స్ తోనూ స్క్రీన్ షేర్ చేసుకుంటోంది.



# కాంబినేషన్ రిపీట్?

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మన టాలీవుడ్ లో ఉన్నటువంటి పలు క్రేజీ కాంబినేషన్ చిత్రాల్లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ అలాగే దర్శకుడు బుచ్చిబాబు సానా కలయిక కూడా ఒకటి. వారి కలయికలో చేస్తున్న పెద్ది సినిమా మంచి స్టాండర్డ్స్ ఇప్పుడు సెట్ చేయగా ఈ సినిమా తర్వాత మళ్ళీ వీరి కలయికలలో ఓ సినిమా ఉంటుంది అని బజ్ వినిపించింది. అయితే ఇప్పుడు స్పోర్ట్స్ డ్రామా చేస్తున్న వీరి కలయిక నెక్స్ట్ ప్రాజెక్ట్ గా మాత్రం ఒక సెపరేట్ జానర్ ని ఎంచుకున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న రూమర్స్ ప్రకారం బుచ్చిబాబు ఈసారి రామ్ చరణ్ తో ఇతిహాసాల బ్యాక్ డ్రాప్ లో సినిమా చేస్తాడని వినిపిస్తుంది. మరి ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ కి సాలిడ్ డివోషనల్ సబ్జెక్టు పడితే దాని ఇంపాక్ట్ వేరే లెవెల్లో ఉంటుంది. మరి దానిని బుచ్చినే తీసుకొస్తాడా లేదా మరో దర్శకుడు చేస్తాడా అనేది కాలమే నిర్ణయించాలి.



# మరోసారి వార్తల్లో..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి వార్తల్లో నిలిచారు. అది కూడా ఆమె ఏదైనా కొత్త సినిమా అనౌన్స్‌మెంట్‌తోనో, అవార్డుతోనో కాదు..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


ఒక పాకిస్థానీ క్లాతింగ్ బ్రాండ్ ప్రచారంతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక ప్రముఖ డ్రెస్ బ్రాండ్‌ను అలియా ప్రమోట్ చేస్తున్నట్లు కొన్ని ఫొటోలు వైరల్ కావడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. అసలు అలియా నిజంగానే ఆ బ్రాండ్‌కు సైన్ చేసిందా? లేక దీని వెనుక ఏదైనా మాయ ఉందా? అనే విషయాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. అయితే అసలు నిజం ఎంటంటే.. పాకిస్థాన్‌కు చెందిన 'వజేషా అఫీషియల్' అనే బ్రాండ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అలియా భట్ ఫొటోలను షేర్ చేసింది. అందులో అలియా వివిధ రంగుల సిల్క్ దుస్తుల్లో మెరిసిపోతూ కనిపించింది. అయితే, ఈ ఫొటోలను నిశితంగా పరిశీలిస్తే అసలు విషయం బయటపడింది. ఇవి నిజమైన ఫొటో షూట్ ఫొటోలు కావు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఫొటోషాప్ సాయంతో సృష్టించిన ఫేక్ ఫొటోలు. 2024లో లోరియల్ పారిస్ ర్యాంప్ వాక్, అలాగే 2026 మిలాన్ ఫ్యాషన్ వీక్‌లో అలియా చేసుకున్న మేకప్, హెయిర్ స్టైల్స్ ను ఈ బ్రాండ్ డిజిటల్‌గా కాపీ చేసి, తమ దుస్తులపైకి మార్చింది. కాగా ఈ మోసాన్ని గమనించిన నెటిజన్లు ఈ బ్రాండ్ పై మండిపడుతూ..'అసలు ఈ విషయం అలియాకు తెలుసా? ఆమె మీపై కేసు వేస్తుంది' అని హెచ్చరించగా.. ఆ బ్రాండ్ ఏమాత్రం భయం లేకుండా 'ఆమె వేయదు, ఈ పోస్ట్ ను వైరల్ చేయండి ఆమెకే తెలుస్తుంది' అంటూ వెటకారంగా సమాధానం ఇచ్చింది. స్టార్ హీరోయిన్ల క్రేజ్‌ను వాడుకుంటూ, వారికి ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఇలా ఏఐ సాయంతో బ్రాండ్ ఇమేజ్‌ను వాడుకోవడంపై ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# విడుదలకు సిద్ధం..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా చేస్తున్న అవైటెడ్ సీక్వెల్ చిత్రమే 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో వచ్చిన మొదటి పార్ట్ ఎలాంటి సెన్సేషన్ సెట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇక దానికి కొనసాగింపుగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాపై మేకర్స్ ఇప్పుడు సాలిడ్ అప్డేట్ అందించారు. సినిమా తాలూకా మొత్తం షూట్ ని ఇప్పుడు కంప్లీట్ చేసినట్టు మేకర్స్ సెట్స్ నుంచి కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకుంటున్న పిక్స్ తో రివీల్ చేశారు. సో జైలర్ పార్ట్ 2 షూట్ మొత్తం పూర్తయ్యింది. ఇక రిలీజ్ డేట్ ఒక్కటి మాత్రమే బాకీ ఉందని చెప్పాలి. ఇదెప్పుడు రివీల్ చేస్తారో చూడాలి. ఈసారి కూడా పలు ఊహించని క్యామియోలు ఉంటాయనే టాక్ ఉంది. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఈ సన్ పిక్చర్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



# 'ఎన్టీఆర్ - నీల్' ఫస్ట్ గ్లింప్స్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచవ్యాప్తంగా భారీ క్రేజ్ ఉన్న మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, కెజియఫ్ సిరీస్, సలార్ లాంటి సెన్సేషనల్ హిట్స్ ఇచ్చిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో భారీ యాక్షన్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రాన్ని తాత్కాలికంగా ఎన్టీఆర్ నీల్ మూవీ అని పిలుస్తున్నారు. ఈ సినిమాపై ఇటు ఫ్యాన్స్, అటు ఇండస్ట్రీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక ఎగ్జయిటింగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఫస్ట్ గ్లింప్స్, సినిమా రిలీజ్ డేట్ గురించి వివరాలను తెలియజేశారు. 'ఎన్టీఆర్‌నీల్' ఫస్ట్ గ్లింప్స్ ను మే 20, 2026న, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా రిలీజ్ చేయబోతున్నారు. ఆ గ్లింప్స్ ఒక పవర్‌ఫుల్ సినిమాటిక్ వరల్డ్‌ను పరిచయం చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ ఎగ్జయిట్‌మెంట్‌ను మరింత పెంచుతూ టీమ్ సినిమా రిలీజ్ డేట్‌ను కూడా అధికారికంగా ప్రకటించింది. ఎన్టీఆర్‌నీల్ సినిమా జూన్ 11, 2027న శుక్రవారం థియేటర్లలోకి రానుంది. దీంతో ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూడాల్సిన డేట్‌గా ఇది మారింది. ఈ డబుల్ సర్‌ప్రైజ్‌తో, మే 20న 'ఎన్టీఆర్-నీల్' ప్రపంచాన్ని చూడాలని ఫ్యాన్స్ లో మరింత ఆసక్తి పెరిగింది. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ నీడలాంటి ఓ లుక్‌లో కనిపిస్తున్నారు. దీంతో సినిమా మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఎన్టీఆర్, నీల్ కాంబోపై ఉన్న ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఎన్టీఆర్ స్లిమ్‌గా కనిపించబోతున్నారు. ఈ పవర్‌హౌస్ స్టార్ ప్రాజెక్ట్ కోసం చాలా కష్టపడుతున్నారు. తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్నారు. తీర్చిదిద్దిన శరీరంతో ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యాక్షన్ సీక్వెన్స్ లు చేయడం ఫ్యాన్స్ కి ఒక పెద్ద ట్రీట్ లా ఉండబోతోందనటంలో సందేహం లేదు. ఈ సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇది తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ సహా పలు భాషల్లో మూవీ విడుదల కాబోతోంది. ప్రశాంత్ నీల్ ఊహించినట్టుగా ఎన్టీఆర్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో ఎలా మెప్పించబోతున్నారోనని ఫ్యాన్స్ చూడాలని ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

# వివాదాలకు అతీతంగా..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 'క్వీన్'గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి కంగనా రనౌత్. గతేడాది 'ఎమర్జెన్సీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన ఆమె, ప్రస్తుతం ముంబై 26/11 దాడుల నేపథ్యంలో తెరకెక్కుతున్న 'భారత్ భాగ్య విధాత' చిత్రంతో బిజీగా ఉన్నారు. వివాదాలకు అతీతంగా, తన మనసులోని మాటను ధైర్యంగా చెప్పే కంగనా, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదురైన ఆసక్తికర పరిణామాలను పంచుకున్నారు. సల్మాన్ ఖాన్ ప్రోత్సాహం నుంచి భన్సాలీ ఆఫర్‌ను తిరస్కరించడం వరకు ఆమె పంచుకున్న విశేషాలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కంగనా మాట్లాడుతూ.. 'నా కెరీర్ మొదలవ్వక ముందు, కేవలం 16 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు సల్మాన్ ఖాన్‌ను కలిశారు. అప్పట్లో నన్ను చూడగానే సల్మాన్ 'ఈమె సంజయ్ లీలా భన్సాలీ హీరోయిన్' అని కొనియాడి, నన్ను వెళ్లి భన్సాలీని కలువమని సూచించారు. సల్మాన్ మాట మీద భన్సాలీని కలిసినప్పటికీ, అప్పట్లో నాకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కానీ, కాలక్రమేణా నా స్టార్‌డమ్ చూశాక భన్సాలీ స్వయంగా 'రామ్ లీలా'లో ఒక స్పెషల్ సాంగ్ కోసం సంప్రదించారు. అయితే, నాకు ఐటెం నంబర్లు చేయడం ఇష్టం లేదని ఆ భారీ ఆఫర్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించా. "ఆ క్షణం అలా గడిచిపోయింది, కానీ భన్సాలీ గారు ఇప్పటికీ సల్మాన్ మాట విని ఉండాల్సిందని అంటుంటారు" అని కంగనా గర్వంగా చెప్పుకొచ్చారు. అలాగే హాలీవుడ్ గురించి మాట్లాడుతూ.. 'చాలా మంది భారతీయ నటీనటులు హాలీవుడ్ వైపు పరుగులు తీస్తున్నారు. కానీ నాకు మాత్రం హాలీవుడ్ వెళ్లే ఉద్దేశం ఏమాత్రం లేదు. ఎందుకంటే హాలీవుడ్ సినిమాలో అమెరికాను గొప్పగా చూపించాలనే ఒక ప్రత్యేకమైన ఎజెండా ఉంటుంది.



# సరికొత్త మర్డర్ మిస్టరీతో...

**'గేదెల రాజు' డైరెక్టర్ చైతన్య మోటూరి**

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రఘుకుంచే టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'గేదెలరాజు'. కాకినాడ తాలుకా సినిమా ట్యాగ్‌లైన్. రఘుకుంచే తో పాటు రామచంద్రం పుణ్యమూర్తుల, వికాస్, టీనా శ్రావ్య, మౌనిక, రవి చిన్నిబిల్లి తదితరులు నటించిన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు విడుదలై మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మోటూరి టాకీస్ పతాకంపై రఘు కుంచె సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 24న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. మీడియాతో జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ చైతన్య మోటూరి. ఆ విజయాలు ఆయన మాటల్లోనే..



✦ మా స్వస్థలం అమలాపురం. నేను డాక్టర్ కావాలనేది మా కుటుంబ సభ్యుల కోరిక. ఇంటర్ అయ్యాక ఫిజియోథెరపీ చేశాను. ఒక క్లినిక్ ప్రారంభించాను. చదువుల్లో ముందున్నా, సినిమా, సాహిత్యం మీద ఆసక్తి ఉండేది. చిన్నప్పటి నుంచే కథలు, కవిత్వాలు రాసేవాడిని. ఆ ఆసక్తి అలా పెరుగుతూ వచ్చింది. క్లినిక్ నిర్వహిస్తున్నప్పుడే షార్ట్ ఫిలిం క్లబ్ ఏర్పాటు చేసి స్థానికంగా ఆసక్తి ఉన్నవారిని చేర్చుకుంటూ వచ్చాను. అలా నాకంటూ ఒక టీమ్ తయారైంది. అందులో ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ ఉండేవారు. ఇలా కాకినాడలో షార్ట్ ఫిలింస్ చేస్తున్న టైమ్ లో డియర్ కామ్రేడ్ దర్శకుడు భరత్ కమ్మను సంప్రదించాను. ఆయన అమలాపురం, కాకినాడలో కొన్ని ప్లెజెంట్ విజువల్స్ తీసుకురమ్మని చెప్పారు. డ్రోన్ షాట్స్ తో సహా మంచి విజువల్స్ తీసుకెళ్లి చూపించాను. ఆయనకు నచ్చి నన్ను డైరెక్షన్ టీమ్ లోకి ఏడీగా తీసుకున్నారు. అలా చిత్ర పరిశ్రమలో నా జర్నీ మొదలైంది. డియర్ కామ్రేడ్ టైమ్ లో సినిమా వర్క్స్ నేర్చుకున్నాను. ఆ తర్వాత అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమాకు కూడా వర్క్ చేశాను. నేను మూవీ ట్రయల్స్ చేస్తూ ప్రొడ్యూసర్స్ కు కథలు చెప్పేవాడిని. వాళ్లకు నా కథలు నచ్చినా రెండో సినిమా చేద్దామని అనేవారు.

✦ మొదట గేదెల రాజు చిత్రాన్ని చిన్న బడ్జెట్ లో చేయాలని అనుకున్నా. అయితే కథ స్పాన్ పెరగడం, ఇంట్రెస్టింగ్ గా స్క్రిప్ట్ రావడంతో కొంత కొంతగా బడ్జెట్ పెరుగుతూ వచ్చింది. లోకల్ గానే సినిమా అంతా చేయాలనుకున్నాం. యారీ కెమెరాలు వాడాం. గెదెల రాజు క్యారెక్టర్ కు మాత్రం నోటెడ్ ఆర్టిస్టును తీసుకోమని దర్శకులు భరత్ కమ్మ, దుశ్యంత్ సలహా ఇచ్చారు. అలా మా సెర్చింగ్ రఘు కుంచె గారి దగ్గరకు వచ్చింది. అప్పటికి మ్యూజిక్ డైరెక్టర్, గేదెల రాజు క్యారెక్టర్ కోసం ఎవర్నీ తీసుకోలేదు.

✦ కాకినాడ పరిసర ప్రాంతాల్లో రౌడీల గురించి నాకు తెలిసిన విషయాలు, స్థానికంగా జరిగిన ఘటనలు.. ఇవన్నీ కలిపి ఈ కథ రాసుకున్నాను. ఇది ఏ ఒక్కరి కథ కాదు. నాకు తెలిసిన విషయాలెన్నో ఈ కథగా రాశాను. నేను కొత్త దర్శకుడిని కాబట్టి విలన్ నే మెయిన్ గా పెట్టి సినిమా చేస్తే ఇంట్రెస్టింగ్ గా ఉంటుందని అనిపించింది. మనం సోషల్ మీడియాలో ఎన్నో క్రైమ్ స్టోరీస్ చూస్తున్నాం, యూట్యూబ్ లో క్రిమినల్స్ ఇంటర్వ్యూస్ చూస్తున్నాం. అలా నేను విన్నవే ఈ కథకు స్ఫూర్తి. డెయిర్ ఫామ్ నడిపే గేదెల రాజు అనే రౌడీ షీటర్ కథ ఇది. మా తాతయ్య రోజూ మహాభారతం చదివి వినిపించేవారు. ఆయన చెప్పిన వాటిలో కనికుడి పాత్ర నాకు గుర్తుండిపోయింది.

✦ మా మూవీకి ప్రధాన ఆకర్షణగా రఘు కుంచె గారి మ్యూజిక్ నిలుస్తుంది. ఆయన ఈ సినిమాకు మంచి బీజీఎం చేశారు. మాకున్న బడ్జెట్ లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా హై క్వాలిటీ సౌండింగ్ ఇచ్చారు. సినిమా చూసిన వాళ్లు బీజీఎం గురించి, సాంగ్స్ గురించి మాట్లాడుకుంటారు. డాల్బీ అట్మాస్ లో సౌండింగ్ చేయించాం. మూడు పాటల్లో మెలోడీ సాంగ్, సెలబ్రేషన్ సాంగ్, గేదెలరాజు పోయినప్పుడు ఒక సరదా సెటైరికల్ సాంగ్ ఉంటాయి. గేదెలరాజు వుమైనజర్. అతను ఎంతోమందికి నగలు ఆశజూపి లోబర్చుకుంటాడు. ఆ మాట నెరవేర్చుకోడు. అలాంటి వాళ్లంతా గేదెలరాజు పోయినప్పుడు తిడుతుంటారు. కొందరు పొగుడుతుంటారు. అలాంటి వాళ్లందరి తిట్లు, పొగడ్తల నేపథ్యంతో ఈ పాట ఉంటుంది. గేదెలరాజు గా రఘు కుంచె గారు రియలిస్టిక్ పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. ఒక రౌడీ షీటర్ ఎలా నవ్వుతాడో, ఎలా మాట్లాడుతాడో, ఎలా కోపంగా చూస్తాడో అవన్నీ రఘు గారి పర్ ఫార్మెన్స్ లో సహజంగా చూస్తారు.

✦ నాన్ లీనియర్ స్క్రీన్ ప్లేతో సాగే మర్డర్ మిస్టరీ స్టోరీ ఇది. వర్తమానంలో గతంలో జరిగినవి చూపిస్తూ మర్డర్ మిస్టరీ కథను ఆసక్తికరంగా తెరకెక్కించాను. ఇందులో రెండు బ్యూటిఫుల్ లవ్ స్టోరీస్ కూడా చూపిస్తున్నాం. మొత్తం ఐదు కథలు గేదెలరాజు చుట్టూ జరుగుతుంటాయి. చూస్తే ఒకటే నిజం, చూడకపోతే వంద అనుమానాలు అనే క్యాప్షన్ కూడా మా మూవీకి పర్ఫెక్ట్ గా పెట్టాం. మా సినిమా చూసిన ఎవరూ కూడా కథలోని ట్విస్ట్ ను కనిపెట్టలేకపోయారు. మేము ఎక్కడా సినిమాటిక్ లిబర్టీ తీసుకోకుండా పూర్తిగా నేచురల్ గా వెళ్లాం. ప్రతి పాత్ర మీరు ఎక్కడో చూసినట్లు, విన్నట్లు ఉంటుంది. గేదెలరాజు వేసుకుని డ్రెస్సులు కూడా సెకండ్ హ్యాండ్ మార్కెట్ లో కొన్నవే. ఇంత నేచురల్ గా తెరకెక్కించాం కాబట్టే సినిమా ఆడియెన్స్ కు నచ్చుతుందనే నమ్మకం పెట్టుకున్నాం.

-ఎం.డి అబ్దుల్

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**